


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

28.08.2026
శుక్రవారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 107
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## అమరావతి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- సెక్రటేరియెట్‌లో అధికారులతో సమీక్ష
- ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం
- అనుకున్న సమయానికల్లా పనులు పూర్తి చేయాలి
- అవసరమైన నిధులు వెంటనే రిలీజ్ చేయాలి
- సీఆర్డీఏ అధికారులను ఆదేశించిన సీఎం



**అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్**

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీసీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్‌తో పాటు, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయ్ రామరాజు హాజరయ్యారు. అనుకున్న సమయానికి పనులు పూర్తయ్యేలా చూడాలని ఈ సమావేశంలో చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. అలాగే, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణం పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**నేపాల్ వరదల్లో ఏపీ యాత్రికులు.. చంద్రబాబు సమీక్ష!**

నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలు, అక్కడి పరిస్థితి, ఏపీకి చెందిన యాత్రికుల క్షేమ సమాచారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులందరినీ సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని సీఎం స్పష్టం చేశారు.

మానస సరోవర్ యాత్రకు వెళ్లిన ఏపీకి చెందిన పలువురు యాత్రికులు నేపాల్ వరదల్లో చిక్కుకున్నారని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రానికి చెందిన 41 మంది వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించామని, వారిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని తెలిపారు. మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందని, వారి కోసం నిరంతరం గాలింపు, సమాచార సేకరణ కొనసాగుతోందని చెప్పారు.

**నలుగురు యాత్రికులు టిబెట్‌లో సురక్షితంగా**

కర్నూలు, ఆదోని ప్రాంతాలకు చెందిన నలుగురు యాత్రికులు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వారితో ఇప్పటికే మాట్లాడినట్లు చెప్పారు. తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండూలో క్షేమంగా ఉన్నారని, వారితోనూ ఆర్టీజీఎస్ ద్వారా సంప్రదింపులు జరిపినట్లు వివరించారు. అయితే చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు చెందిన ఏడుగురి ఆచూకీ ఇంకా తెలియలేదని తెలిపారు.

ఆచూకీ లభ్యం కాని ఏడుగురిలో ముగ్గురు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానస సరోవర్ యాత్రకు వెళ్లినవారని అధికారులు సీఎంకు వివరించారు. ప్రస్తుతం వారి ఫోన్లు అందుబాటులో లేకపోవడంతో వారిని గుర్తించేందుకు అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబాలతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, అందుబాటులోకి వస్తున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి చేరవేస్తున్నట్లు చెప్పారు.

6లో..

## “జో ఖేలేగా.. వో ఖిలేగా”

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- క్రీడల్లో యువత చురుగ్గా పాల్గొనాలి: ప్రధాని
- గ్రామీణ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం
- క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సౌకర్యాలు
- స్పోర్ట్స్ సైన్స్‌పై ప్రత్యేక దృష్టి
- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత్: మోదీ

2లో..



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్**

జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29) సందర్భంగా దేశంలోని క్రీడాకారులు, యువతతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా సంభాషించారు. ‘ఖేలో ఇండియా డైలాగ్ - ఖేల్ కీ బాత్, ప్రధాని మోదీతో’ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

## పాక్‌కు S400 అతిపెద్ద ముప్పు

- మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా
- S-400ల స్థానాన్ని గుర్తించేందుకు పాక్ గూఢచారులు
- ఆపరేషన్ సిందూర్‌పై కీలక విషయాలు

2లో..



**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**

గతేడాది జరిగిన “ఆపరేషన్ సిందూర్”కు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. భారత వైమానిక రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకమైన S400 సిస్టమ్ మొత్తం యుద్ధంలో ప్రముఖ పాత్ర పోషించిందని, ఇవి ఎక్కడ మోహరించి ఉన్నాయనే వివరాలు కనుక్కోవడానికి పాకిస్తాన్ తన గూఢచారుల్ని, స్లీపర్ సెల్స్‌ను యాక్టివేట్ చేసిందని రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా వెల్లడించారు.

## నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలా వేలాడుతున్నారా?

- రామ్‌దేవ్ బాబాపై కంగనా ఫైర్
- యోగాగురువు నుంచి వ్యాపారవేత్తగా మారారు

2లో..



## 8 మంది ఏపీ యాత్రికుల గల్లంతు

- నేపాల్ వరదలపై మంత్రి లోకేష్ సమీక్ష
- ముగ్గురి ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు!
- కొనసాగుతున్న అత్యవసర చర్యలు
- చైనా సరిహద్దు ప్రాంతాల్లో మిస్సింగ్



**అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌ను హఠాత్తుగా ముంచెత్తిన ఫ్లాష్ ఫ్లడ్స్ (ఆకస్మిక వరదలు) అక్కడ పర్యటిస్తున్న భారతీయ యాత్రికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ ప్రాణాంతక వరదల ధాటికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కనీసం ఎనిమిది మంది యాత్రికులు దారితెలియని పరిస్థితుల్లో చిక్కుకుపోయారని.... వారి ఆచూకీ దొరకడం లేదని నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రాథమికంగా ధృవీకరించింది.

2లో..

## హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత
- హరీష్ రావు అరెస్ట్
- పోలీసు స్టేషన్ ఎదుట కార్యకర్తల ధర్నా



**హనుమకొండ, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్**

నగరంలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడినుంచి తరలించారు. ఈ క్రమంలో ధర్నా శిబిరం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులు, బీఆర్ఆర్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది.

2లో..

## దేశంలో క్రీడలకు మోదీ కొత్త దిశ చూపించారు

కేంద్ర మంత్రి పెమ్మసాని



2లో..

**అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్**

దేశంలో క్రీడలకు కొత్త దిశ చూపిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2014 తర్వాత క్రీడారంగంలో వ్యవస్థీకృత సంస్కరణలు జరిగాయని వివరించారు.

## ఓయూ స్టూడెంట్లను మోసం చేయొద్దు

- వెయ్యి కోట్లు ఎక్కడ?
- రేవంత్‌పై రాంచందర్ రావు ఆగ్రహం
- ఓయూకు ఒక్క రూపాయి ఇవ్వలేదు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్



**హైదరాబాద్, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

6లో..

## చిలకలూరిపేటలో ఘోర ప్రమాదం

- ఏడుగురి మృతి, 8 మందికి తీవ్ర గాయాలు!
- ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొనడంతో ప్రమాదం

2లో..

**పల్నాడు, అనంత జనశక్తి న్యూస్**

పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈరోజు తెల్లవారుజామున ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మృతులందరూ చిలకలూరిపేట మండలం వేలూరుకు చెందిన వారిగా గుర్తించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## ఏఐసీసీకి క్రమశిక్షణ కమిటీ నివేదిక

కొండా సురేఖ వ్యవహారం

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్**

మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

## సెప్టెంబర్ 1న బెంగళూరులో ప్రకాశ్ రాజ్ నిరసన ర్యాలీ



2లో..

## జలప్రళయంలో చిక్కుకోలేదు క్షేమంగానే ఉన్నాం



2లో..

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం । అనంతపురం
28.08.2026


# ఏఐసీసీకి క్రమశిక్షణ కమిటీ నివేదిక



(మొదటి పేజీ తరువాయి)

తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు.
కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు SIR నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# చిలకలూరిపేటలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం జిల్లా కొండమంజులూరులో పుట్టినరోజు వేడుకలలో పాల్గొని తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆటోలో 15 మంది ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాబుతో పాటు మరో ఆరుగురు మృతి చెందారు.
ప్రమాద ఘటనా స్థలిలోనే నలుగురు మృతి చెందారు. ఇద్దరు గుంటూరు జీజీహెచ్‌లో, ఒకరు చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయారు. మృతులు మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మీ, గంగమ్మ, మరియమ్మ, సువార్తలుగా గుర్తించారు. ఆటోడ్రైవర్ అకస్మాత్తుగా టర్న్ తీసుకోవడం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు విచారణలో తేలింది. గ్రామానికి చెందిన ఆరుగురు మృతి చెందడంతో.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావు ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్‌తో పాటు పలువురిని హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకున్నారు.
ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు.

# 8 మంది ఏపీ యాత్రికుల గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)



రాయబార కార్యాలయం వెల్లడించిన జాబితా ప్రకారం.... టిబెట్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో చోప్పరపు రమేష్ బాబు (53), అన్నందేవర వెంకట్రామ్ (52), అన్నందేవర అనఘ (49)లు ఉన్నట్లు చివరిసారిగా సమాచారం అందింది. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సంబంధాలు తెగిపోయాయి. మరో యాత్రికుడు బాల సుబ్రహ్మణ్యం కూడా గల్లంతయ్యాడు.... ఆయన ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు.
ఇక శశికుమార్ అట్లూరి, రాజ్యలక్ష్మి నిమ్మగడ్డలు చైనాలోని 'గిరోంగ్ ఇమ్మిగ్రేషన్ ఆఫీస్' వద్ద చివరిసారిగా కనిపించినట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు సురక్షితంగానే ఉన్నప్పటికీ, వరదల కారణంగా బయటకు రాలేక అక్కడ చిక్కుకుపోయినట్లు తెలిసింది. ఆగస్టు 26 సాయంత్రం నాటికి అపర్ణ కాకాని అనే మహిళ సురక్షితంగా ఉన్నారని.... అధికారులు ఆమె పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని రాయబార కార్యాలయం తెలిపింది.
నేపాల్‌లో సంభవించిన వినాశకరమైన వరదల వల్ల మొత్తం 288 మంది భారతీయ పౌరులతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయిందని భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన దాదాపు 200 మంది భారతీయులు తమను సురక్షితంగా తరలించాలని (ఎవాక్యుయేషన్) ప్రభుత్వ సహాయాన్ని కోరారు.
విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఢిల్లీలో మీడియాకు వివరాలు వెల్లడిస్తూ.... ఈశా ఫౌండేషన్‌కు చెందిన పెద్ద సంఖ్యలో సభ్యులు కూడా హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఆచూకీ లేకుండా పోయారని తెలిపారు. అదే సమయంలో తమిళనాడుకు చెందిన 21 మందిని సురక్షితంగా రక్షించినట్లు చెప్పారు. చైనా సరిహద్దు వైపున కూడా కొంతమంది భారతీయులు చిక్కుకుపోయారని ఆయన వివరించారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమవ్వడం వల్ల బాధితులను సంప్రదించడం సవాలుగా మారిందని జైస్వాల్ తెలిపారు. విపత్తులో నలిగిపోతున్న నేపాల్‌కు భారత్ తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు, సహాయక సామగ్రితో కూడిన రెండు ప్రత్యేక విమానాలను పంపించిందని పేర్కొన్నారు.

# దేశంలో క్రీడలకు మోదీ కొత్త దిశ చూపించారు

(మొదటి పేజీ తరువాయి)



ప్రతిభ గుర్తింపు, యాంటీ డోపింగ్ చట్టాలతో క్రీడలకు ఊతం లభించినట్లు అయిందన్నారు. గుంటూరులో రూ.14 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. క్రీడా బడ్జెట్‌లో కేటాయింపులు రూ.2 వేల నుంచి రూ.4 వేల కోట్లకుపైగా పెంచిన్లు తెలిపారు.
వచ్చే ఐదేళ్లలో రూ.25 వేల కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. ఒలింపిక్ స్థాయి శిక్షణా కేంద్రాల ఏర్పాటే కేంద్ర ప్రభుత్వ విజన్‌కు నిదర్శనమని అన్నారు. 2030 కామన్వెల్త్, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. యువతతో సంభాషణ ద్వారా వారి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత్ పతకాల పెరుగుదలకు యువతలో పెరిగిన ఆత్మవిశ్వాసమే కారణమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

# సెప్టెంబర్ 1న బెంగళూరులో ప్రకాశ్ రాజ్ నిరసన ర్యాలీ

## ఓట్ల తొలగింపుపై సమరభేరి

**బెంగళూరు, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్**

కర్ణాటక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో చోటుచేసుకున్న లోపాలపై ప్రజా సంఘాలు, పౌర హక్కుల వేదికలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశంపై సినీ నటుడు, దర్శకనిర్మాత ప్రకాశ్ రాజ్ మండిపడ్డారు. ఓటర్ల తొలగింపును నిరసిస్తూ సెప్టెంబర్ 1న బెంగళూరులో 'ఛలో ఎలక్షన్ కమిషన్' పేరుతో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బెంగళూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ, సీఐఆర్ 2026 ప్రక్రియపై స్టే విధించాలని కోరుతూ పౌర సమాజ సంఘాలు త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేశారు.
"ఈ దేశంలో ఒక ఓటరు, సాధారణ పౌరుడు తన హక్కుల కోసం ఎన్నేళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగాలి? ఓటర్లను ఎందుకు ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు? కర్ణాటకలో శాసనసభ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అలాంటప్పుడు ఇంత హడావుడిగా ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టాల్సిన అత్యవసరమేమొచ్చింది?" అని ప్రకాశ్ రాజ్ నిలదీశారు.
రాజ్యాంగబద్ధమైన ప్రక్రియేనా? ప్రకాశ్ రాజ్ ఘాటు వ్యాఖ్యలు



ఎన్నికల కమిషనర్ల ఎంపిక విధానంపై కూడా ప్రకాశ్ రాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నియామక ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా లేదని ఆయన ఆరోపించారు. "కమిటీలో అధికార పక్షం నుంచి ఇద్దరు, ప్రతిపక్షం నుంచి ఒక్కరు మాత్రమే ఉంటే అక్కడ ప్రజాస్వామ్యానికి చోటెక్కడుంది? అంతేకాకుండా ఎన్నికల కమిషన్ అధికారులకు చట్టపరమైన మినహాయింపు కల్పిస్తూ పార్లమెంట్‌లో నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అధికారులు ఎలాంటి తప్పులు చేసినా వారిపై కేసులు నమోదు చేసేందుకు వీలుండదు. ఇది అధికారులకు మితిమీరిన స్వేచ్ఛను ఇస్తూ, జవాబుదారీతనాన్ని నిర్వీర్యం చేయడమే" అని ఆయన అభిప్రాయపడ్డారు.

**1.08 కోట్ల ఓటర్లకు ముప్పు: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆందోళన**

కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆగస్టు 24న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేసిన అనంతరం సవరణ ఫలితాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో ఏకంగా 1.08 కోట్ల మందిని 'ASDDO' (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్, అదర్స్) కేటగిరీ కింద తొలగింపు జాబితాలో చేర్చడం దిగ్భ్రాంతికరమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, దాదాపు 43 లక్షల మంది ఓటర్లకు డేటా వ్యత్యాసాలు, 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ లింక్ లేదనే కారణంతో నోటీసులు పంపనున్నట్లు శివకుమార్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు డీకే శివకుమార్ లేఖ రాశారు. అర్హులైన నిజమైన ఓటర్లు తమ అభ్యంతరాలను, ఆధారాలను దాఖలు చేయడానికి సమయాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

# జలప్రళయంలో చిక్కుకోలేదు క్షేమంగానే ఉన్నాం

- **డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి**
- **తిరుపతికి చెందిన 28 మంది కాఠ్‌మాండూలో క్షేమం**

**అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌లో మెరుపు వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికుల క్షేమ సమాచారంపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా ఉన్నారని, మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు మంత్రికి వివరించారు. ఆచూకీ లభించని ముగ్గురిలో కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మి ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరి ఆచూకీ కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి లోకేష్ అధికారులను సూచించారు.
ఈషా ఫౌండేషన్‌కు చెందిన శశికుమార్ చివరిసారిగా చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద కనిపించినట్లు అధికారులు వెల్లడించారు. ఆయనను గుర్తించేందుకు చైనా, నేపాల్ అధికారులతో సమన్వయం కొనసాగించాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్న కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు యాత్రికులు క్షేమంగా ఉన్నారు. సురక్షితంగా ఉన్న యాత్రికులను వీలైనంత త్వరగా అక్కడి నుంచి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని లోకేష్ అధికారులను ఆదేశించారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయంతో పాటు చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ తాజా సమాచారాన్ని సేకరించాలని మంత్రి సూచించారు. ఆచూకీ లభించని ముగ్గురి కోసం ప్రత్యేకంగా సమన్వయ చర్యలు కొనసాగించాలని చెప్పారు. నేపాల్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో జలప్రళయం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులకు సంబంధించిన వీడియోలు మీడియా, సోషల్ మీడియాలో చూస్తేనే భయానకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ పర్యటనకు వెళ్లిన భారతీయులు, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల యాత్రికుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. నేపాల్ టూర్‌కు వెళ్లిన తమ కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ఎలా ఉన్నారోనని ఇక్కడ ఉన్న వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో టిబెట్ మానససరోవర్ యాత్రలో ఉన్న డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. తాము నేపాల్ జలప్రళయంలో చిక్కుకోలేదని.. ప్రస్తుతం సురక్షితంగా ఉన్నామని స్పష్టం చేశారు.
బుధవారం ఓ మీడియా సంస్థతో మాట్లాడిన సతీష్ రెడ్డి.. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని వెల్లడించారు. నేపాల్‌లో వరదలు వచ్చిన ప్రాంతాన్ని ఇప్పటికే దాటి ముందుకు వెళ్లినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మానససరోవర్ యాత్రలో ఉన్నామని.. తమ బృందంలోని అందరూ క్షేమంగానే ఉన్నారని చెప్పారు. ఈనెల 30వ తేదీన హైదరాబాద్‌కు చేరుకుంటామని సతీష్‌రెడ్డి వెల్లడించారు.
మరోవైపు నేపాల్ వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకుల సమాచారాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పరిస్థితిని పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఏపీకి చెందిన ఐదుగురి ఆచూకీ ఇంకా లభించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన సుహాసిని రెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన రమేశ్‌బాబు, కాకినాడ జిల్లాకు చెందిన మరో ముగ్గురి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు.
అయితే మానససరోవర్ యాత్రకు వెళ్లిన కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతానికి చెందిన కొందరు యాత్రికులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం సంప్రదింపులు కొనసాగిస్తోంది. తిరుపతికి చెందిన 28 మంది యాత్రికులతో కూడిన బృందం ప్రస్తుతం కాఠ్‌మాండూలో సురక్షితంగా ఉన్నట్లు ఏపీ అధికారులు గుర్తించారు. యెల్లకొండ ప్రాంతంలోని ఓ హోటల్‌లో వారు ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు వారిని సంప్రదించారు. తామంతా క్షేమంగానే ఉన్నామని యాత్రికులు తెలిపారు.
నేపాల్‌లో ఉన్న ఏపీ యాత్రికుల వివరాలను సేకరించేందుకు రాష్ట్ర అధికారులు పర్యాటక సంస్థలు, యాత్ర నిర్వహించే ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు కూడా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నారు. యాత్రికులు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.
మరోవైపు.. నేపాల్‌లో ఆకస్మిక వరదలు, భారీ వర్షాల కారణంగా పరిస్థితులు తీవ్రంగా మారాయి. ఇప్పటికే వందలాది మంది గల్లంతైనట్లు అధికారికంగా సమాచారం వెలువడటంతో అక్కడికి వెళ్లిన భారతీయ యాత్రికుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. గల్లంతైన వారిలో వందల సంఖ్యలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తలు రావడంతో వారి ఆచూకీ కోసం భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం భారీ వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య 175కు చేరినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 300 మంది భారతీయులు వరదల్లో కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ అధికారికంగా ప్రకటించారు.

# "జో ఖేలేగా.. వో ఖిలేగా"

(మొదటి పేజీ తరువాయి)

**ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లు, యువత, యువ నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. సుమారు 1,500కి పైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని క్రీడా రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో క్రీడా సంస్కృతిని పటిష్టం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి ప్రతిభను వెలికితీయడం అత్యంత ఆవశ్యకమని నొక్కిచెప్పిన మోదీ, "ఆదేవాడే ఆనందంగా వికసిస్తాడు" (జో ఖేలేగా, వో ఖిలేగా) అనే బలమైన సందేశాన్ని అందించారు.**
**కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు, క్రీడా రంగానికి చెందిన ప్రతీ ఒక్కరికీ ప్రధాని మోదీ జాతీయ క్రీడా దినోత్సవ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, వర్ధమాన క్రీడాకారుల గుర్తింపు, సరైన శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ వినియోగం, క్రీడాకారుల భవిష్యత్తుకు భరోసా వంటి కీలకమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. 'ఖేలో ఇండియా' ఉద్యమం ద్వారా చిన్న చిన్న నగరాలు, గ్రామాలు, పట్టణాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మౌలిక వసతులు, వనరుల కొరత ఉన్న ప్రాంతాలకు సైతం క్రీడా సౌకర్యాలను చేరువ చేసి, క్రీడాకారులకు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలుస్తున్నట్లు వివరించారు.**
**అంతేకాకుండా, అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించే దిశగా, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత్‌ను క్రీడా రరంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఏళ్లలో అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఇప్పటి నుంచే అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రణాళిక అని వెల్లడించారు. ఈ దిశగా క్రీడల్లో భారత్‌ను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై యువత కూడా తమ సలహాలు, సూచనలను ప్రధానితో పంచుకున్నారు. క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం సాధ్యమని పునరుద్ఘాటిస్తూ, మోదీ మరోసారి "ఆదేవాడే ఆనందంగా వికసిస్తాడు" అని గుర్తుచేస్తూ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.**

# పాక్‌కు S400 అతిపెద్ద ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు ఈయన నాయకత్వం వహించారు. ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మిశ్రా ఈ వివరాలను వెల్లడించారు. ఎస్400 కారణంగా పాకిస్తాన్ యుద్ధ విమానాలు భారత సరిహద్దుకు 200 కిలోమీటర్ల పరిధిలోకి కూడా రాలేకపోయాయని తెలిపారు.

**పాకిస్తాన్‌కు ముప్పుగా ఎస్-400 సుదర్శన చక్ర:**

రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను "సుదర్శన చక్ర"గా అభివర్ణిస్తారు. ఇది ఉపరితలం నుంచి శత్రుదేశాలు ప్రయోగించే క్షిపణులు, విమానాలు, డ్రోన్లను గుర్తించి, అడ్డుకోగలదు. 2018లో భారత్, రష్యా నుంచి 5 ఎస్ 400 సిస్టమ్స్ కోసం ఒప్పందం చేసుకుంది. ఇందులో మూడు వ్యవస్థలు భారత్‌కు అందాయి. ఇప్పుడు నాలుగో స్క్వాడ్రన్ ఈ ఏడాది జూన్‌లో అందుతుంది.
ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్400లు ఎక్కడున్నాయో కనుక్కోవడానికి పాకిస్తాన్ తీవ్రంగా కష్టపడింది. గూఢచారులతో పాటు ఇతర దేశాల శాటిలైట్ సాయాన్ని కూడా తీసుకుందని మిశ్రా తెలిపారు. సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు చైనా రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ అందించినట్లు వార్తలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ విమానాలు గగనతలంలోకి వస్తే ప్రతీసారి ఎస్400 పరిధిలో లక్ష్యంగా మారాయి. దీంతోనే వీటి స్థానాలు కనుక్కోవడానికి పాకిస్తాన్ ప్రయత్నించింది.



**సైన్యానికి పూర్తిగా స్వేచ్ఛ:**

పహల్గాం దాడి తర్వాత భారత సైన్యానికి దాడి విషయంలో ప్రభుత్వం పూర్తిగా స్వేచ్ఛనిచ్చినట్లు మిశ్రా చెప్పారు. అయితే పౌరుల ప్రాణాలకు నష్టం కలగకుండా, ఉగ్రవాదులు, వారి మద్దతుదారులనే లక్ష్యంగా చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఉగ్రవాదులు, వారి హ్యాండ్లర్లను టార్గెట్ చేసుకున్నారు. మే 7న జైష్, లష్కర్‌కు చెందిన తొమ్మిది ఉగ్ర శిబిరాలపై భారత్ దాడులు చేసిన తర్వాతే పరిస్థితి ముగిసే అవకాశం ఉందని, అయితే పాకిస్థాన్ ఉద్రిక్తతలను పెంచిందని మిశ్రా తెలిపారు.
పాకిస్తాన్ ఆదంపూర్ ఎయిర్ స్టేషన్ లక్ష్యంగా 1415 డ్రోన్లు ప్రయోగించిందని వీటిన్నింటిని భారత్ నిర్వీర్యం చేసిందని ఆయన తెలిపారు. అయితే, మే 9న పాకిస్తాన్ వందలాది డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసిందన్నారు. పాకిస్తాన్ పౌర ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, గురుద్వారాలను లక్ష్యంగా చేసుకున్నట్లు మిశ్రా ఆరోపించారు. దీంతో భారత్ ప్రతిదాడికి దిగాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

**పాకిస్తాన్ రాడార్లు ధ్వంసం:**

భారత ఎయిర్ ఫోర్స్ మొదట పాకిస్తాన్ వైమానిక సామర్థ్యాలను ధ్వంసం చేసిందని మిశ్రా చెప్పారు. పంజాబ్‌లో ఉన్న అమెరికన్ AN/TPS సిరీస్ రాడార్లతో సహా పాకిస్థాన్‌కు చెందిన రాడార్లను ధ్వంసం చేశామని, రెండు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. దీంతో పాకిస్తాన్ ఒక రకంగా "చూపు" కోల్పోయినట్లు చెప్పారు. భూమిపై ఉన్న రాడార్లు ధ్వంసం కావడంతో పాకిస్తాన్ గగనతల నిఘా కోసం AWACS వంటి వైమానిక వ్యవస్థలపై ఆధారపడాల్సి వచ్చిందని మిశ్రా తెలిపారు. సర్గోధాలో అవాక్స్ విమానాన్ని మోహరించగా, ఎస్400 దానిని కూల్చివేసినట్లు వెల్లడించారు. ఎస్400 ఆపరేటర్ అనుమతి కోరినప్పుడు తాను "షూట్" ఆదేశాలు ఇచ్చానని, దీంతో 341 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించిందని మిశ్రా చెప్పారు. ఇది సర్ఫేస్ టూ ఎయిర్ దాడుల్లో అత్యంత లాంగ్ రేంజ్ దాడుల్లో ఒకటిగా నిలించిందని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌లో మహిళా ఫైటర్ పైలట్లు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. లష్కరేతోయిబా మురిద్కే కార్యాలయంతో పాటు మే 10న పాకిస్తాన్ ఎయిర్ బేస్‌లు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలపై దాడులు చేశారని చెప్పారు.

# నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలా వేలాడుతున్నారా?

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

యోగాగురువు రామ్‌దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'ఆయన (రామ్‌దేవ్) నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా వేలాడుతున్నారా' అని ప్రశ్నించారు. గతంలో నీట్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులను కంగన విమర్శించిన విషయం తెలిసిందే. నిరసనకారులను జనరేషన్ గట్టర్(అంటే మురికి తరమని అర్థం) అని దూషించారు. అయితే ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆమె సర్వత్రా విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కంగన వ్యాఖ్యలపై రామ్‌దేవ్ బాబా ఘాటుగా స్పందించారు. యువతను జనరేషన్ గట్టర్ అనడానికి ఆమె అర్హతేంటని ప్రశ్నించారు. కంగన జీవితం ఎలాంటిదో అందరికీ తెలుసని మండిపడ్డారు. అలాంటి వారి గురించి మాట్లాడడం తనకు ఇష్టం లేదన్నారు. రామ్‌దేవ్ విమర్శలకు తాజాగా కంగన కౌంటర్ ఇచ్చారు. 'నా జీవితం గురించి, నా వ్యక్తిత్వం గురించి రామ్‌దేవ్‌కు ఎలా తెలుసు? ఆయన నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా వేలాడుతూ ఈ విషయాలు గమనిస్తున్నారా?' అంటూ ఆమె సెటైర్లు వేశారు. యోగాగురువు నుంచి వ్యాపారవేత్తగా మారిన ఆయన తనకు వ్యక్తిత్వం నేర్పకూడదని ధ్వజమెత్తారు. సనాతన ధర్మంతో మొదలై పక్కా వ్యాపారిగా రామ్‌దేవ్ బాబా మారిపోయారని విమర్శించారు. ఆయుర్వేద మందులు అమ్మే స్థాయి నుంచి లోదుస్తులు అమ్మే స్థాయికి ఆయన వ్యాపారం దిగజారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా గతంలో రామ్‌దేవ్‌కు సంబంధించిన పతంజలి సంస్థపై కంగన కోర్టులో కేసు కూడా వేశారు. ఆ సంస్థ ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొన్నారు.





# "లంచం డబ్బులు మొత్తం సమానంగా పంచుకుంటాం"

**– గంగాజలం సాక్షిగా ప్రమాణం చేసిన కౌన్సిలర్లు**

ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడటమే కాకుండా.. లంచాల పంపకం కోసం పవిత్రమైన గంగాజలాన్ని సాక్షిగా పెట్టుకుని ప్రమాణం చేసిన దారుణ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని షాజహాన్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న ఈ వింత ప్రతిజ్ఞకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగుతోంది. స్థానికంగా ఉన్న 60 మంది ప్రజాప్రతినిధుల.. లంచం డబ్బులను తాము సమానంగా పంచుకుంటామని.. గంగాజలం సాక్షిగా ప్రమాణం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. ప్రజలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పదవీ ప్రమాణ స్వీకారాన్ని తలపించిన లంచాల ఒప్పందం**



సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతిలో రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని చేసే పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం తరహాలోనే ఈ 'లంచం ప్రతిజ్ఞ' వేడుక జరగడం గమనార్హం. ఒక వ్యక్తి పాత్రలో పవిత్ర గంగాజలాన్ని పట్టుకుని నిలబడగా.. మిగతా కౌన్సిలర్లు అందరూ తమ చేతుల్లో నీటిని ఉంచుకుని ఆయన చదివిన ప్రమాణ వచనాలను తూచా తప్పకుండా వల్లెవేశారు. ఈ వింత ప్రమాణంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీకి సంబంధించి ఏదైనా లంచం రూపంలో సొమ్ము వస్తే.. ఆ డబ్బును కార్పొరేషన్‌లోని 60 మంది కౌన్సిలర్ల మధ్య ఏమాత్రం తేడా లేకుండా సమానంగా పంచుకుంటామని ఒకరికొకరు మాట ఇచ్చుకున్నారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఏ ఒక్క సభ్యునికైనా ఏదైనా సమస్య లేదా ఇబ్బంది ఎదురైతే.. మిగిలిన వారందరూ అతనికి అండగా నిలబడి పూర్తి మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు.

**లంచం పంపకాల ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే..!**

ఈ అక్రమ ప్రమాణంలో మరొక తీవ్రమైన అభ్యంతరకరమైన అంశాన్ని కూడా పొందుపరిచారు. ఈ లంచాల పంపకాల ఒప్పందాన్ని ఉల్లంఘించిన వారిని, సమాచారాన్ని బయటకు చేరవేసిన వారిని 'ద్రోహి'గా పరిగణిస్తామని బెదిరించే ధోరణిలో ప్రస్తావించడం కౌన్సిలర్ల తెగింపునకు అద్దం పడుతోంది. ప్రజాధనాన్ని లంచాల రూపంలో దోచుకోవడానికి, దానిని పంచుకోవడానికి మున్సిపల్ సభ్యులు ఈ స్థాయిలో దిగజారడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

**విచారణకు ఆదేశించిన మున్సిపల్ కమిషనర్..**

ఈ సంచలన వీడియో బయటకు రావడంతో మున్సిపల్ కమిషనర్ సౌమ్యా గురురాణి స్పందించారు. ఈ వీడియో గత ఏడాది నవంబర్ నెలకు సంబంధించినదని, ఆ సమయంలో తాను ఈ మున్సిపల్ కమిషనర్ పదవిలో లేనని ఆమె స్పష్టం చేశారు. అయినప్పటికీ.. దీని తీవ్రతను బట్టి సమగ్ర విచారణకు తక్షణమే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ అక్రమ ప్రమాణ స్వీకారంలో పాల్గొని దోషులుగా తేలిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## 11 వేల కి.మీ. రైలు మార్గాలు ఇక నాలుగు వరసలు: వైష్ణవ్



ఢిల్లీ: దేశంలో అత్యంత రద్దీగా ఉండే ఏడు మార్గాలను నాలుగు వరసలుగా విస్తరిస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రయాణికుల చేరవేత, సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచడానికి మొత్తంగా 11వేల కి.మీ. మార్గాలను ఇలా తీర్చిదిద్దుతున్నామని, రైల్వే వ్యవస్థలో ఇది 16 శాతమే అయినా ట్రాఫిక్‌లో వీటిద్వారా వెళ్లేదే 41 శాతమని ఆయన 'ఎక్స్'లో తెలిపారు. ఢిల్లీ హౌవ్‌డా, ముంబయి ఢిల్లీ, హౌవ్‌డా చెన్నై, చెన్నైముంబయి, ఢిల్లీచెన్నై, ముంబయిహౌవ్‌డా, ఢిల్లీ గువాహటి మార్గాలను నాలుగు వరసలుగా చేస్తున్నట్లు చెప్పారు. తక్కువ వ్యయంతో, కాలుష్యరహిత రవాణాకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.

## యజమాని ఎవరో తేల్చేందుకు గేదెకు డీఎన్ఏ పరీక్ష!

బిహార్‌లో ఓ గేదె వివాదం పోలీస్‌స్టేషనుకు చేరి, ఇప్పుడు డీఎన్ఏ పరీక్ష దాకా వెళ్లింది. గయా జిల్లాకు చెందిన ఈ గేదె అసలు యజమాని ఎవరో నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్ష చేయించాలని మగధ్ రేంజ్ ఐజీ వికాస్ వైభవ్ ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేవరకు గేదెను పోలీసుల అధీనంలోనే ఉంచాలని ఎస్పీకి సూచించారు. జిల్లాలోని అతరీ పోలీస్‌స్టేషను పరిధికి చెందిన సూరజ్ యాదవ్ గేదె కొద్దిరోజుల క్రితం కనిపించకుండా పోయింది. నౌరంగా టోలీలోని ప్రకాశ్ మాంఝీ తన ఇంట్లో గేదెను కట్టేసి ఉంచారని సూరజ్‌కు సమాచారం అందింది. దీంతో గేదె నాది అంటే.. నాదే అంటూ ఇద్దరూ పోలీసులను ఆశ్రయించారు. వివాదం నానాటికీ ముదిరి ఎంతకూ తెగకపోవడంతో డీఎన్ఏ పరీక్షకు ఐజీ ఆదేశించారు. డీఎన్ఏ సాయంతో ఆ గేదె తల్లిదండ్రుల సంబంధ ధ్రువీకరణ ద్వారా యాజమాన్యాన్ని నిర్ధారించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.



## పాఠశాల ప్రవేశ పత్రంలో కులం వివరాల గడి వద్దు



**– అధికారులకు హిమాచల్‌ప్రదేశ్ సీఎం ఆదేశం**

శిమ్లా: పాఠశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు నింపే పత్రాల్లో కులం వివరం తెలిపే గడిని తొలగించాలని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి దీనిని అమలు చేయాలన్నారు. హిమాచల్‌ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ మండలి సమావేశానికి బుధవారం అధ్యక్షత వహించిన సందర్భంగా ఈ విషయాన్ని పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్షను నిర్మూలించి, సౌభ్రాతృత్వాన్ని, సమానత్వాన్ని ప్రోత్సహించే దిశగా ఈ చర్య తొలి అడుగని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందే సమయంలో కులం వివరం జతచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



## రైల్వేట్రాక్‌పై యువతి రీల్స్.. 2 చేతులు కోల్పోయి విషాదం

ఝార్ఖండ్‌లో రైల్వేట్రాకుపై రీల్స్ చేస్తున్న పూర్ణిమ కుమారి(19) అనే యువతిని వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు చేతులు కోల్పోవడమే కాకుండా మిగతాచోట్లా తీవ్ర గాయాలయ్యాయి. గఢ్వా జిల్లాకు చెందిన ధీరజ్‌సింగ్ కుమార్తె పూర్ణిమ. మంగళవారం స్నేహితులతో కలిసి రీల్స్ చేసేందుకు గఢ్వా పోలీస్‌స్టేషను పరిధిలోని జోబరీయా గ్రామ సమీప రైల్వేట్రాకు వద్దకు వెళ్లింది. ట్రాకుపై వీడియో చిత్రీకరిస్తూ వెనుక వైపు రైలు వస్తున్న విషయాన్ని ఆమె గమనించలేదు. దీంతో ట్రాకుపై ఉన్న పూర్ణిమను రాంచీ చోపన్ రైలు ఢీకొట్టింది. స్నేహితులు ఆమెను గఢ్వా సదర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం పూర్ణిమను మరో పెద్ద ఆసుపత్రికి తరలించేందుకు సిఫార్సు చేసినట్లు గఢ్వా సివిల్ సర్జన్ జాన్ ఎఫ్.కెన్నెడీ తెలిపారు.

## అధికారంలోకి వస్తే.. ఏటా ప్రతి మహిళకు రూ.40 వేలు ఇస్తాం: సమాజ్‌వాదీ పార్టీ



లఖ్‌నవూ: రానున్న 2027 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి తాము అధికారంలోకి వస్తే.. ఏడాదికి ప్రతి మహిళకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సాయం అందించే స్త్రీ సమ్మాన్ సమృద్ధి యోజన అమలు చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ బుధవారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మెయిన్‌పురి ఎంపీ డింపుల్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ పథకం వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి మహిళకు వర్తిస్తుందని చెప్పారు. మహిళలు ఆత్మగౌర

## యూపీ వృద్ధ మహిళలకు ఉచిత బస్సు పథకం షురూ

**అరవై, అంతకు మించి వయసున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వ బస్సుల్లో జీవితకాలం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న 24 గంటల్లోనే ఆ పథకాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించి లోక్‌మాతా అహిల్యాబాయ్ మాతృశక్తి యాత్ర పథకం పేరుతో లఖ్‌నవూలో ఆయన పలు ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. బస్సుల్లో ఉన్న కొంతమంది మహిళలతో సంభాషించారు, సెల్ఫీ తీసుకున్నారు.**



## జెన్ ఆల్ఫా, జీ తరాలకు చేరువయ్యేందుకు ఈసీ ప్రణాళిక

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు జెన్ ఆల్ఫా, జీ తరాలకు చేరువయ్యేందుకు ఎన్నికల సంఘం తన ప్రణాళికను పునర్వ్యవస్థీకరించింది. ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంచే కార్యక్రమాలకు యువత నాయకత్వం వహించడమే లక్ష్యంగా ముందడుగు వేయనుంది. దేశంలోని 4,123 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 912వ తరగతులు చదువుతున్న విద్యార్థులు, కళాశాలలు, వర్సిటీలకు చెందిన యువతను ఈసీ లక్ష్యంగా చేసుకోనుంది. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం.. దేశంలో 1826 ఏళ్ల వయసు గల వారు 14.78 కోట్ల మంది ఉన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 చొప్పున 50,000 ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ (ఈఎల్‌సీ)లు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం 15 లక్షల పాఠశాలల్లో 912 తరగతుల విద్యార్థులను సంప్రదించనుంది. 70,000 కళాశాలలు, 1,400 విశ్వవిద్యాలయాలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయనుంది.

## ఈ బస్సంటే.. మంటకే కడుపుమంట!

**ఈ బస్సులో మంటలు చెలరేగినా విస్తరించవు. ఫ్లోరింగ్, ఇంటీరియర్ మెటీరియల్, కర్టెన్లు, వైరింగ్.. ఏవీ అగ్ని ప్రమాదం బారిన పడవు. స్లీపర్ బస్సుల్లో అమర్చే పార్టిషన్ డోర్లు వీటిలో ఉండవు. అన్నిరకాలుగా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేశారు గనకే.. ఈ 15 మీటర్ల పొడవైన మల్టీయాక్సిల్ స్లీపర్ బస్సుకు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ-ఐక్యాట్) దేశంలోనే తొలి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. భారతీయ ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ (ఏఐఎస్)-119, 153 కింద జారీ చేసిన మొట్టమొదటి ధ్రువపత్రం ఇదేనని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ తెలిపింది. స్లీపర్ వేరియెంట్ బస్సులో 42 బెర్త్‌లు, హైబ్రిడ్ మోడల్‌లో 21 బెర్త్‌లు, 42 సీట్లు ఉంటాయి. రాజస్థాన్‌లోని సైనాటీ బస్‌బాడీ బిల్డింగ్ సంస్థ దీన్ని రూపొందించింది.**




## వృద్ధుడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. అది పక్షవాతమని తేల్చిన వైద్యులు



పశ్చిమ ముంబయిలోని అంధేరీలో ఒంటరిగా నివాసం ఉంటున్న శరద్ కదమ్ (70) మంగళవారం కారు నడుపుతూ మరో రెండు వాహనాలను ఢీకొన్నారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. సరిగ్గా మాట్లాడలేకపోయిన శరద్ పలుమార్లు ప్రయత్నించినా బ్రీత్ ఎనలైజరు పరికరంలోకి గాలిని ఊదడంలోనూ విఫలమయ్యారు. ఇది మద్యం ప్రభావమే అని నిర్ధారించుకున్న పోలీసులు ఆయనపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదుచేసి, పోలీస్‌స్టేషనుకు తరలించారు. శరద్ భార్యాపిల్లలు విదేశాల్లో ఉంటున్నారు. విషయం తెలిసి బంధువు ఒకరు పోలీస్‌స్టేషనుకు వచ్చారు. అప్పటికే కొన్ని గంటలు గడిచిపోయాయి. శరద్ అస్వస్థతతో ఉన్న విషయాన్ని ఆయన గమనించి పోలీసులను అప్రమత్తం చేయడంతో కూపర్ ఆసుపత్రికి తరలించారు. సీటీ స్కానింగు చేసిన వైద్యులు అది మద్యం మత్తు కాదని, ఆయనకు స్వల్ప పక్షవాతం సోకినట్లుగా తేల్చారు. దీంతో ప్రత్యేక చికిత్స కోసం శరద్ నానావతి ఆసుపత్రిలో చేరారు. అస్వస్థతకు గురైన వృద్ధుణ్ని మద్యం తాగారని ఠాణాలో కూర్చోబెట్టి వైద్యం అందడంలో జాప్యం చేశారంటూ శరద్ బంధువు పోలీసుల తీరుపై మండిపడ్డారు.

## చక్కెర ధర ఎక్కువే ఉండాలి.. వయసు 40 దాటితే తినొద్దు



**మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదలపై ప్రజల్లో ఉన్న ఆందోళనను కొట్టిపారేస్తూ మధ్యప్రదేశ్ భాజపా సీనియర్ నాయకుడు, రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కైలాశ్ విజయ్ వర్గీయ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చక్కెర ధర అధికంగానే ఉండాలని, 40 ఏళ్ల వయసు పైబడ్డవాళ్లు దానిని తినడం మానుకోవాలని సలహా ఇచ్చారు. పండుగల ముందు చక్కెర ధర పెరగడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడంపై బుధవారం మీడియా ఆయనను ప్రశ్నించగా, పై వ్యాఖ్యలు చేశారు. తాను మిఠాయిలు తినడం పూర్తిగా మానేశానని మంత్రి చెప్పారు. ద్రవ్యోల్బణం తగ్గిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన భాజపా పేదలను, మధ్యతరగతి ప్రజలను అసంబద్ధమైన ఇటువంటి వ్యాఖ్యలతో ఎగతాళి చేస్తోందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతు పట్వారీ విమర్శించారు.**



# హరిత కొలువులు వస్తున్నాయ్!

పరిశ్రమల నుంచి వెలువడే పొగ, కొండల్లా పేరుకుంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, భానుడి భగభగలు, అకాల వర్షా లు... భూగోళం ఎంతటి ప్రమాదకర స్థితిలోకి జారిపోయిందో తెలియజేస్తున్నాయి. మరోవైపు, ప్రపంచమంతటా నిరుద్యోగ సమస్య వేధిస్తోంది. ఆర్థికమాంద్యం తరహా భయాలూ వెంటాడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో భూతాపాన్ని తగ్గించే సరికొత్త ఆర్థిక వ్యవస్థగా 'గ్రీన్ ఎకానమీ' ప్రాచుర్యం పొందుతోంది.

పర్యావరణాన్నీ ప్రకృతి వనరులనూ నాశనం చేయకుండా, కాలుష్యాన్ని సాధ్యమైనంతగా తగ్గించే ఆర్థిక కార్యకలాపాల సమాహారమే గ్రీన్ ఎకానమీ (హరిత ఆర్థిక వ్యవస్థ). బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాలకు స్వస్తిపలికి సౌర, పవన విద్యుత్తు వైపు మళ్లడం, విద్యుత్ వాహనాలను(ఈవీ) వాడటం, ఇళ్ల నుంచి వచ్చే చెత్త, ఈ-వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం, సేంద్రియ సాగు పద్ధతులను పాటించడం వంటివన్నీ హరిత ఆర్థికంలోకే వస్తాయి. ఈ రంగంలో మేనేజర్, ఇంజనీర్ మొదలు చివరిస్థాయి టెక్నీషియన్ వరకు ఉద్యోగాలన్నీ హరిత ఉద్యోగాలే (గ్రీన్ జాబ్స్).

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో), అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థలు సంయుక్తంగా విడుదలచేసిన 'రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ జాబ్స్ యాన్యువల్ రివ్యూ' నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ రంగంలో 1.66 కోట్ల మంది పనిచేస్తున్నారు. 2030 నాటికి మరో 3.4 కోట్ల ఉద్యోగాలు రాబోతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా చైనా 73లక్షల గ్రీన్ జాబ్స్‌తో మొదటిస్థానంలో ఉంటే... ఐరోపా, అమెరికాలు ఆ తరవాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. భారత్‌లోనూ రాబోయే రోజుల్లో హరిత ఉద్యోగాలు భారీగా అందివస్తాయని అంచనా. పీఎం సూర్యఘర్ వంటి కేంద్ర పథకాలతో వచ్చే అయిదేళ్లలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయి. కానీ, యువత వాటిని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోందనే వాదన ఉంది.

## పెద్దసంఖ్యలో అవకాశాలు

లింక్డ్ఇన్ గ్లోబల్ గ్రీన్ స్కిల్ రిపోర్టు- ప్రపంచవ్యాప్తంగా హరిత ఉద్యోగాల డిమాండ్ ఏటా 7.7శాతం మేర పెరుగుతుంటే, అందుకు అవసరమైన నైపుణ్యాలు కలిగినవారు మాత్రం 4.3 శాతమే ఉన్నట్లు విశ్లేషించింది. సంప్రదాయ డిగ్రీలు గ్రీన్ మార్కెట్ అవసరాలను తీర్చలేకపోతున్నాయి. యువత పాతకాలపు కోర్సులకే పరిమితం కాకుండా ఎనర్జీ మేనేజ్‌మెంట్, వ్యర్థాల నిర్వహణ, సస్టయినబుల్ ప్రొక్యూర్‌మెంట్, ఏఐ ఆధారిత పర్యావరణ పరిరక్షణ నైపుణ్యాలపై పట్టు సాధించడం ముఖ్యం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఇటీవల దావోస్‌లో నిర్వహించిన సదస్సులో దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు గనులు, డీజిల్ వంటి సంప్రదాయ పరిశ్రమలను మూసివేసేటప్పుడు, అక్కడ ఉద్యోగాలు కోల్పోయేవారికి సోలార్, రీసైక్లింగ్ రంగాల్లో పునరావాసం కల్పించాలనీ, ఆ మేరకు వారికి కొత్త నైపుణ్యాలు నేర్పించాలనీ తీర్మానించారు. రాబోయే రోజుల్లో గ్రీన్ సర్టిఫికేషన్ ఉన్న సంస్థలకే పెట్టుబడులు సమకూరుతాయంటున్న మెకిన్సే గ్లోబ□ల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం- పరిశ్రమలో వస్తున్న మార్పులకు అద్దంపడుతోంది.

గ్రీన్ ఎకానమీతో సంప్రదాయ ఉద్యోగాలు తగ్గినా, వాటి స్థానంలో నాలుగు రెట్లు ఎక్కువగా హరిత ఉద్యోగాలు అందివస్తాయన్నది ఐఎల్‌వో అంచనా. తయారీ రంగాన్ని హరితమయం చేసేందుకు అమెరికా పర్యావరణం, గ్రీన్ ఎనర్జీ కోసం 369 బిలియన్ డాలర్ల భారీ ప్యాకేజీతో చట్టం తీసుకొచ్చింది. ఐరోపా దేశాలు 2050 నాటికి ప్రపంచంలోనే మొట్టమొదటి కాలుష్యరహిత ఖండంగా అవతరించాలని లక్షిస్తున్నాయి. ఇందుకోసం 'గ్రీన్ స్కిల్ అకాడమీ'లను స్థాపించి, కాలేజీ విద్యార్థులకు ఉచితంగా హరిత నైపుణ్యాలను మప్పుతుండటం విశేషం.

## నైపుణ్యాలను నేర్పే కోర్సులు కావాలి

భారత్ రూ.19,774 కోట్ల పెట్టుబడితో హరిత ప్రణాళికను రచించింది. దీనివల్ల కొత్తగా ఆరు లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా. తెలంగాణలో సౌర విద్యుత్, ఈవీల తయారీ, ఈ-వేస్ట్ రీసైక్లింగ్, గ్రీన్ బిల్డింగ్ నిర్మాణ రంగాల్లో పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్‌ను క్లీన్‌టెక్ స్టార్టప్‌లకు కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, పవన విద్యుత్తు, పంప్డ్ స్టోరేజ్, పోర్టు ఆధారిత శుద్ధ ఇంధన ప్రాజెక్టులకు ప్రాధాన్యం పెరుగుతోంది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని హరిత ఉద్యోగ నైపుణ్యాల మండలి దేశవ్యాప్తంగా సౌర సాంకేతిక నిపుణులు, ఈ-వ్యర్థాల నిర్వహణ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రైవేటు భాగస్వామ్యంతో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో గ్రీన్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తోంది. అయితే, చాలామంది వీటిపై అవగాహన లేక ఇప్పటికీ సంప్రదాయ కోర్సులనే ఎంచుకుంటున్నారు. ఆపై ఉద్యోగాలు పొందలేక నిరాశకు గురవుతున్నారు. కాబట్టి, హరిత ఉద్యోగాలపై యువతకు పెద్దయెత్తున అవగాహన కల్పించాల్సి ఉంది. కళాశాలల్లో హరిత కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు వాటిలో చేరేలా యువతను ప్రోత్సహించాలి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను వారిలో పెంపొందించాలి. అప్పుడే ఉద్యోగాల కల్పనతో పాటు హరిత లక్ష్యాలనూ అందుకోగలం.



# కులగణన తేల్చేదేమిటి?

**జన గణనలో కుల గణన కూడా చేర్చాలన్న డిమాండ్‌ను నిరుడు ఏప్రిల్‌లో కేంద్రం అంగీకరించగా, అందుకు అనుసరించబోయే విధానంపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. పౌరులనుంచి రాబట్టే సమాచారానికి సంబంధించిన 40 ప్రశ్నల్లో కులం కూడా ఒకటిగా ఉండబోతోందని కేంద్రం నోటిఫికేషన్ వెల్లడించింది. అయితే దీనివల్ల ఏ మేరకు ప్రయోజం ఉంటుందన్న సందేహం తలెత్తుతుంది. వివిధ కులాల పేర్లు ఇచ్చి దాన్లో దేనికి చెందుతారో తెలపాలని పౌరుల్ని అడిగితే నిర్దిష్టమైన డేటా వెల్లడవుతుంది. అందుకు బదులుగా వారు చెప్పిన కుల వివరాలు నమోదు చేయటం వల్ల ప్రయోజనం ఉంటుందా? 2011లో యూపీఏ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల గణన అంటూ దేశవ్యాప్తంగా ఒక సర్వే చేసింది. ఎన్నడో 1931లో వలస పాలకుల హయాం తర్వాత దేశంలో కులాలను గణించటం అదే మొదటిసారని అందరూ సంతోషించారు. కానీ ఆ గణనవల్ల ఏ ప్రయోజనమూ కలగలేదు. పౌరులు చెప్పిన వివరాల తర్వాత కులాలు, ఉపకులాలు, అక్షరక్రమంలో తేడాలు**




**తదితరాల ఆధారంగా దాదాపు 46 లక్షల 73 వేల రకాలు నమోదయ్యాయి. కులాలవారీగా వాటిని వర్గీకరించటానికి 2015లో అప్పటి నీతి ఆయోగ్ చైర్మన్ అరవింద్ పనగారియా నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. తీరా కులాల పేర్లలో ఉన్న అనేక వ్యత్యాసాల కారణంగా అయోమయం ఏర్పడి, ఆ డేటాను అధికారికంగా విడుదల చేయలేదు.**

ఇప్పుడు కూడా అదే పరిస్థితి తలెత్తగలదన్న సందేహం చాలామందిలో ఉంది. ఏ కులానికి చెందుతారన్నది తెలియజేసేలా జాబితా రూపొందించి ప్రశ్నించటంవల్ల సమాధానం సులభమవుతుంది. అర్థవంతమైన డేటా లభిస్తుంది. ఒక రాష్ట్రంలో ఉన్న కులం వేరే రాష్ట్రంలో ఉండదు. అలాగే ఒకచోట బీసీగా పరిగణించే కులం మరోచోట ఎస్సీగానో, ఎస్టీగానో ఉండే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కులాల సేకరణకు అనువైన పద్ధతుల్ని ఎంచుకోవాలి. పార్లమెంటులో ఇందుకు సంబంధించి లోతైన చర్చ జరిగివున్నా, రాష్ట్రాలవారీగా సమావేశాలు నిర్వహించి, ఆ యా ప్రాంతాల్లో ఉండే కులాలు, వర్గాల గురించిన జాబితా ఖరారుచేసివున్నా జాతీయ స్థాయిలో ఏ కులాలు ఏ కేటగిరీ కిందకు వస్తాయో, తీసుకురావాలో ఒక అంచనా వచ్చేది. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో మన దేశం కులం నిర్వహించే పాత్ర తక్కువేమీ కాదు.

అణగారిన కులాలు స్వాతంత్ర్యానంతరం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటంవంటివి సాధ్యమయ్యాయి. ఆ మేరకు చైతన్యం పెరిగి జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటంలేదన్న అసంతృప్తి ఎక్కువైంది. కులగణన డిమాండ్ వెనక ఈ నేపథ్యం ఉంది. దానికి తగిన డేటా లభించేలా ఈ కుల గణన ఉండొద్దా? ఇప్పుడు పౌరులు అందజేసిన వివరాల ఆధారంగా ఎన్యూమరేటర్లు వర్గీకరించుకుని అయిందనిపిస్తారు. అప్పుడది విశ్వసించదగ్గ డేటా అవుతుందా? తమకు అన్యాయం జరిగిందనీ, తమ కుల జనాభాను తగ్గించి చూపారనీ ఆరోపణలు వెల్లువెత్తే అవకాశం కూడా లేదా?

ఆ సంగతి అటుంచి ఇతర ప్రశ్నలు గమనిస్తే ఇప్పుడు సేకరిస్తున్నది జనాభా లెక్కలా, పౌర నమోదు చిట్టానా అన్న సందేహం రాకమానదు. 2011 నాటి జనగణనలో 29 ప్రశ్నలుంటే అవి ఈసారి 40కి చేరుకున్నాయి. వీటిలో తల్లిదండ్రుల పేర్లు, వివరాలతో పాటు ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, మొబైల్ ఫోన్ నంబర్ వగైరాలున్నాయి. ఈ వివరాల వెల్లడి వ్యక్తిగత గోప్యతకు మంచిదేనా? ఇప్పటికే వివిధ విభాగాలవద్ద ఈ వివరాలుంటాయి. మళ్లీ అవసరమా? 2020 ఏప్రిల్‌నుంచి మొదలుకావాల్సిన జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) ప్రక్రియకు కూడా ఈ మాదిరి ప్రశ్నలే ఉన్నాయి. అది జాతీయ పౌర నమోదు చిట్టా (ఎన్‌ఆర్‌సీ) కోసమేనని విపక్షాలు ఆరోపించాయి కూడా. అయితే కోవిడ్ అవరోధం కారణంగా అది మూలనబడటంతో వివాదం సద్దుమణిగింది. హిమపాతం అధికంగా ఉండే జమ్మూ కశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జనగణనలో కీలకమైన ఈ రెండో దశ సోమవారం లాంఛనంగా మొదలైంది. అందుకే కేంద్రం పారదర్శకంగా వ్యవహరించి అన్ని అంశాలూ తేటతెల్లం చేయాలి. ఈ రాష్ట్రాల్లో ఎదురయ్యే సమస్యల ఆధారంగా తగిన సవరణలు తెస్తే వేరే రాష్ట్రాల్లో ఫిబ్రవరిలో మొదలయ్యే జనగణన నాటికి ఒక సమగ్రత ఏర్పడుతుంది.

# మార్పుల ముంగిట్లో బీజేపీ!

**జూలైలో అపూర్వ ప్రకంపనలు సృష్టించిన విద్యార్థుల నిరసనలు, ఆ తర్వాత నినాదాల హోరులో కొట్టుకుపోయిన పార్లమెంటు వర్షా కాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో ఏమైనా మార్పు వచ్చిందా? ఇదే ఇప్పుడు దేశ రాజధానిలో ఒక ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నది. ప్రస్తావిత పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ తీవ్ర స్థాయిలో ఉన్నదని చెప్పక తప్పదు. సమాజంలో వస్తున్న మార్పులపై ఉలిక్కిపడినట్లు కనపడిన ఆర్ఎస్ఎస్ ఉన్నట్లుండి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువతను, విద్యార్థులను సమీకరించే కార్యక్రమంలో పడింది. సోమవారం నుంచి విశాఖపట్టణం పొలిమేరల్లోని గుడిలోవలో మూడు రోజుల పాటు జరిగే ఆర్ఎస్ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్ సమావేశంలో బీజేపీతో సహా ఆరెస్సెస్‌కు చెందిన 32 అనుబంధ సంఘాలు హాజరవుతున్నాయి. ఈ సమావేశాల్లో కూడా 'జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలి?' అన్నదే ప్రధాన అజెండా. 2027 మార్చి నాటికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో భారీ అంతర్గత మార్పుల క్రమం పూర్తయి కొత్త నాయకత్వంతో ప్రజల ముందుకు సరికొత్తగా వచ్చే తరుణంలో గుడిలోవ సమావేశాలు జరుగుతున్నాయి. ఇవి 'సంఘ్' పరిణామ క్రమంలో కీలక భూమిక నిర్వహించనున్నాయి. 'సంఘ్'తో పాటు భారతీయ జనతా పార్టీలో పరివర్తనానికి కూడా ఈ సమావేశాలు దోహదం చేసే అవకాశాలు లేకపోలేదు.**



పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై కూడా ఉన్నదనడంలో సందేహం లేదు. 32 అనుబంధ సంఘాల్లో బీజేపీ ఒకటి అని 'సంఘ్'లో కొందరు భావించవచ్చు కాని ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీయే 'సంఘ్' రూపురేఖలను మార్చిందని చెప్పడానికి ఆస్కారం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వంలోని సమస్త మంత్రిత్వ శాఖల్లోనూ 'సంఘ్' బాధ్యులు చేరడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వం చేసే తప్పిదాలు, దుశ్చర్యల బాధ్యత కూడా 'సంఘ్' స్వీకరించాల్సి రావడం మరో ఎత్తు. పాకిస్థాన్ వెళ్లి మహమ్మదాలీ జిన్నాకు ఘనంగా నివాళులర్పించినందుకు నాటి బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ ఆడ్వాణీని రాజీనామా చేయించిన ఘనత 'సంఘ్'కు దక్కింది. మరి అటువంటి నైతిక, సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో చలాయించగల శక్తి 'సంఘ్'కు ఉన్నదా? ఇదీ ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ నియామకాల్లోనూ, పొత్తుల నిర్ణయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ కీలక భూమిక నిర్వహించిన 'సంఘ్' ఇవాళ ప్రభుత్వాన్ని ప్రశ్నించగలదా, నిలదీయగలదా అన్నదే కీలక ప్రశ్న. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలని, విధాన నిర్ణయాల్లో తప్పిదాలు జరిగాయని మోదీ సర్కార్ అంగీకరించాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ పదే పదే చెబుతున్నది. మరి ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నది? ఇది విస్మరించలేని విషయం. ఇవాళ రాహుల్‌గాంధీ సహా ప్రతిపక్ష నేతలు కొందరు బీజేపీతో సహా ఆర్ఎస్ఎస్‌ను రాజకీయాల బరిలోకి లాగి వాటి సైద్ధాంతిక స్పష్టతను ప్రశ్నిస్తున్నారు. తద్వారా ఆరెస్సెస్, బీజేపీని వారు ప్రజా న్యాయస్థానంలో నిలబెడుతున్నారనేది స్పష్టం. ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా 'సంఘ్', బీజేపీ మధ్య పెద్ద తేడా చూడని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ తన భావి సైద్ధాంతిక భూమికను నిర్ణయించుకోవడంతో పాటు తన అనుబంధ విభాగమైన బీజేపీని కూడా భావి అవసరాలకు తగ్గట్లు మార్చగలదా లేదా అన్నది తేలవలసి ఉన్నది.

నిజానికి ఒక దశలో, తనకు, అర్ఎస్ఎస్ తోడ్పాటు అవసరం లేదని బీజేపీ వాదించే పరిస్థితి ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా మాట్లాడుతూ 'మొదట్లో అంత సామర్థ్యం లేనప్పుడు ఆర్ఎస్ఎస్ అవసరం మాకు ఉండేది. ఇవాళ మా పార్టీ బాగా విస్తరించింది. తన కాళ్లమీద తాను నిలబడింది. ఇక బీజేపీ తనను తాను నిర్వహించుకోగలదు' అని స్పష్టం చేశారు. అమిత్ షా వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అందువల్లే, 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించినప్పటికీ మోదీ, షా నాయకత్వాలకు తిరుగులేకపోయింది. ఆ తర్వాత ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించగలిగింది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. 'సంఘ్'లో కూడా అనేకమందికి మోదీ, షా నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అటు బహిర్గతంగా, ఇటు అంతర్గతంగా తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల సైద్ధాంతిక నైతికత ఏ సంస్థకు ఉంటుంది?

బహుశా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు అవకాశం కల్పించిందేమో?! దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని, దానికొక పరిభాషను సృష్టించి లోకం మీదకు వదిలారు. దాన్ని స్వీకరించి ప్రత్యర్థులపై పదునైన విమర్శలు చేసేందుకు బీజేపీలో ఒక యంత్రాంగమే కొనసాగింది. బీజేపీ సైద్ధాంతిక భూమికను మోదీయే సృష్టించారా, అందుకు 'సంఘ్' ఆశీస్సులు ఉన్నాయా అన్న అనుమానాలకు తావు లేకుండా పోయింది. స్థూలంగా చెప్పాలంటే మోదీయిజమే బీజేపీ, 'సంఘ్' భావజాలాన్ని నిర్దేశించిందనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో కూడా ఇదే ఇజం కొనసాగింది.

అయితే ఈ జూలైలో సంభవించిన పరిణామాల నేపథ్యంలో తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో 'సంఘ్' ముద్ర ప్రధానంగా కనపడుతుందని కొందరు సైద్ధాంతిక విశ్లేషకులు అంటున్నారు. దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్ధాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా, 14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి బలమైన 'సంఘ్' శిక్షణా పునాది ఉన్నదని చెబుతున్నారు. అంతేకాదు, ఎలాంటి సమాచారాన్ని అయినా సత్యంగా ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11 సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం కూడా విస్మరించదగ్గ పరిణామం కాదు. ఒక రకంగా పార్టీని, మోదీ ఆలోచనా విధానానికి అమిత్ షా శైలి వ్యూహరచనకు భిన్నంగా మార్చేందుకు ప్రయత్నం జరిగినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంత మాత్రాన ఒకప్పుడు వెంకయ్య, సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర నేతలతో నిత్యం పార్టీ కార్యకర్తలు, మీడియా ప్రతినిధులతో ఆరోగ్యకరంగా కనపడ్డ బీజేపీ కేంద్ర కార్యాలయాన్ని మళ్లీ చూడగలిగిన పరిస్థితులు వస్తాయా? కాలచక్రం వెనక్కి తిరగడం అంత సులభం కాదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాజాగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోదీ చేసిన 13వ ప్రసంగంలో గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి పెద్దగా సమయం కేటాయించలేదు. యువ భారతదేశానికి శాస్త్రీయ దృక్పథం, ఆధునిక జాతి నిర్మాణ భాష గురించి పలవరించిన నెహ్రూ బాటలో ఆయన పయనించలేదు. లాల్‌బహదూర్ శాస్త్రిలా 'జై జవాన్, జై కిసాన్' అని నినదించాలను కోలేదు. అటల్ బిహారీ వాజపేయిలా 'జై విజ్ఞాన్' అని జోడించి సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని చెప్పాలనుకోలేదు. పీవీ నరసింహారావులా సంక్లిష్టమైన ఆర్థిక సంస్కరణల గురించి సరళమయిన భాషలో వివరించాలని భావించలేదు. మన్మోహన్‌సింగ్ మాదిరి జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడలేదు. వీరందరికీ భిన్నంగా నరేంద్రమోదీ భారత రాజకీయాల నిఘంటువుకు ఒక కొత్త పదాన్ని జోడించారు. అది: దిమాగీ నక్సల్ (ఆలోచనల పరంగా నక్సలైట్ ). అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. ఉద్యోగాలను అందించలేని విద్యావ్యవస్థను, ప్రశ్న పత్రాల లీక్‌ను, నెరవేరని హామీలను గురించి ప్రశ్నించేవారు, జంతర్ మంతర్ వద్దనే కాకుండా రాంచీ, పాట్నా వంటి నగరాల్లో వీధుల్లోకి వచ్చి ఆందోళన చేసిన వారు ఈ కోవలోకి వస్తారా? పాత వ్యవస్థలతో ఎలా పోరాడాలో మోదీకి తెలుసు. గతంలో ప్రత్యర్థులపై ల్యూటియన్స్, ఆందోళన జీవులు, అర్బన్ నక్సల్స్ లాంటి ముద్రలు ఆయన వేయగలిగారు. అందరినీ ఒకే భావజాలానికి అంటగట్టగలిగారు. కాని అలాంటి ముద్రలతో జెన్ జడ్‌ను కొట్టిపారేయడం అంత సులభం కాదు. స్వీయ దేశంలోనే ఆలోచనాపరులైన, ప్రశ్నించే పౌరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడం జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందా? ప్రపంచ వ్యాప్తంగా జ్ఞాన శక్తిగా గుర్తింపు పొందిన, అనేక కీలక సంస్థల్లో సీఈఓలను సృష్టించిన భారతదేశంలో ఎవరి గురించి మోదీ ఆందోళన చెందుతున్నారు? 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన తర్వాత మోదీ ఇవాళ ఎదుర్కొంటున్న కొత్త సమస్య ఒక అంగీకరించగల భావజాలాన్ని, అందుకు తగ్గ పదజాలాన్ని సృష్టించలేకపోవడమే. అందుకు ప్రధాన కారణం భారతీయ జనతా పార్టీ కానీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కానీ ఒక బలమైన, స్పష్టమైన, శాస్త్రీయమైన, నవీన తరానికి అనువైన భావజాలాన్ని ఎప్పటికప్పుడు ఏర్పర్చుకోలేకపోవడమే. నినాదాలు, దుర్భాషల రాజకీయాలకు అవకాశం కల్పించడమే. తన పేరును నినదిస్తే మురిసిపోయే వ్యక్తులు కాదు, కాలానికి అనుగుణమైన సిద్ధాంతమే ఇవాళ దేశానికి తక్షణ అవసరం.

# ట్రంప్ మ్యాప్‌ల సంబరం!

**హార్మూజ్ జలసంధిని 'చాలా త్వరలోనే' అమెరికా భూభాగంగా మారుస్తానని గతవారం ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పుడు ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులకు తెగబడొచ్చని కొందరు అనుమానించారు. తీరా మంగళవారం ఆయన చేసిందల్లా 'అమెరికా కొత్త భూభాగం' అని రాసివున్న హార్మూజ్ జలసంధి మ్యాప్‌ను విడుదల చేయటమే. దీంతో ఇరాన్ దౌత్యవేత్తలు ప్రతిదాడికి దిగారు. కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా చూపుతూ ఇరాన్ కాన్సులేట్ ఒక చిత్రపటాన్ని విడుదల చేసింది. వేరే దేశాల భూభాగాలు డిమాండ్ చేయటం, వాటిని అమెరికా భౌగోళిక చిత్రపటాల్లో భాగంగా చూపటం ట్రంప్‌కు కొత్తేం కాదు. రెండోసారి అధికారంలోకొచ్చిన వెంటనే గ్రీన్‌లాండ్‌పై ఆయన కన్నుపడింది. అలాగే కెనడాను అమెరికాలో విలీనం చేసుకుని 51వ రాష్ట్రంగా మారుస్తామనీ, పనామా కాల్వ ఇకపై తమదేననీ, గాజాను 'సొంతం' చేసుకుంటామనీ కూడా పలుమార్లు చెప్పారు.**

అందుకు సంబంధించి ఒక వీడియో రూపొందించి విడుదల చేశారు. వెనిజులా మ్యాప్‌లో అమెరికా జెండాను సూచించే రంగులు నింపారు. అలాగే ఇకపై గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా వ్యవహరించాలంటూ ఉత్తర్వులు జారీచేశారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఈ ప్రాంతం మెక్సికోకు పశ్చిమ, దక్షిణ దిశల్లో, అమెరికాకు ఉత్తరంవైపు, క్యూబాకు ఆగ్నేయంవైపు ఉంది. పేరు మార్చినా ప్రాదేశిక జల పరిధులేమీ మారడంలేదు గనుక మెక్సికో, క్యూబాలు ఈ విషయంలో మౌనంగా ఉండిపోయాయి. ఇక పర్షియన్ గల్ఫ్ పేరును గల్ఫ్ ఆఫ్ అరేబియాగా మారుస్తామని తొలి ఏలుబడిలో 2017లో ప్రకటించారు. దాంతో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ జాగ్రఫీ చదువుకోమని ట్రంప్‌కు సలహా ఇచ్చారు. నిరుడు మే నెలలో సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ పర్యటనకెళ్లే ముందు పేరు మార్పు ఉంటుందని ప్రకటించారు. అటు తర్వాత ఎందుకో దాని జోలికి పోలేదు. ఈ 'భౌగోళిక చిత్రపట దురాక్రమణల్ని' చూసి జనం కాలక్షేపానికి నవ్వుకోవచ్చు. ట్రంప్ ప్రదర్శిస్తున్న అమాయకత్వమో, అజ్ఞానమో చూసి జాలిపడే వారూ ఉండొచ్చు. కానీ అగ్ర రాజ్యాల చరిత్ర తెలిసినవారు దాన్నంత తేలిగ్గా వదిలేయరు. ఒక విశాల పాలస్తీనా భూభాగంలోకి కొన్ని దశాబ్దాల్లో భారీయెత్తున యూదుల్ని తరలించి, అక్కడ నరమేధాలకు పాల్పడి ఇజ్రాయెల్‌ను సృష్టించి, అందుకు ఐక్యరాజ్యసమితి ఆమోదాన్ని 'రాబట్టిన' చరిత్ర ఆ దేశాలది. కనుక ఇప్పుడు ఉబుసుపోక మాట్లాడే మాటల్లో వేరే అర్థాలు ఉండొచ్చన్న అనుమానాలు రావటం సహజం. రాజకీయావతారం ఎత్తి దాదాపు పదిహేనేళ్లవుతున్నా పూర్వాశ్రమంలో నిర్వహించిన రియలెస్టేట్ వ్యాపార ప్రభావంనుంచి ట్రంప్ బయటపడలేకపోతున్నారన్నది వాస్తవం. రియలెస్టేట్ యజమాని మాదిరే ఆయన భూదాహంతో అల్లాడిపోతున్నారు. 'మళ్లీ అమెరికాను ఉన్నతంగా చేద్దాం' అనే నినాదం సారాంశం ఖనిజ సంపద పుష్కలంగా ఉండే ప్రాంతాలను అమెరికాలో విలీనం చేసుకోవటమేనన్న సందేశాన్ని ట్రంప్ పంపుతున్నారు. అందుకే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ గ్రీన్‌లాండ్ సందర్శనకెళ్లినప్పుడు డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల నుంచి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. దాంతో చేసేదిలేక ఆమె మధ్యలోనే ఆ పర్యటనను విరమించుకుని వెనక్కిపోవాల్సి వచ్చింది. జనం భావోద్వేగాలు రెచ్చగొట్టి అధికారంలోకొచ్చినవారు వాటిపైనే మనుగడ సాగించాలనుకోవటం సహజం. అలాగైతేనే వారి వైఫల్యాలు మరుగున పడతాయి మరి. ఈ బాపతు నేతలు అందరి దృష్టి తమపైనే ఉండాలన్న తపనతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. ట్రంప్ దీనికి భూదాహాన్ని కూడా చేర్చారు. ఈ భౌగోళిక చిత్రపటాల్ని చూసిన 'మాగా' జనం నిజంగానే ట్రంప్ వాటిని జయించుకొస్తారన్న భ్రమల్లో ఉంటారు. ఒకపక్క అరేబియా సముద్రంలో లంగరేసిన విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లో దుర్భర పరిస్థితులున్నాయనీ, కొందరు ఆత్మహత్యా యత్నం కూడా చేశారనీ వార్తలొస్తున్నాయి.

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

శుక్రవారం ⁞ అనంతపురం ⁞ 28.08.2026 ⁞ 01


## ప్రతాప్ రెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అనంతపురం, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం శారదానగర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి గురువారం హాజరయ్యారు.నూతన గృహ ప్రవేశం సందర్భంగా ప్రతాప్ రెడ్డి, శిరీష దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డికి ఘనంగా, అపూర్వ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రతాప్ రెడ్డి, శిరీష కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు రామసుబ్బారెడ్డి , సన్నిహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



# చంద్రబాబుతోనే సీమ సస్య శ్యామలం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- 2 ఏళ్లలో రాయలసీమకు హంద్రీ-నీవా ద్వారా 50 టీఎంసీలు తరలించాం
- 19 నియోజక వర్గాల్లో 420కు పైగా చెరువులు నింపాం
- గతంలో పులివెందులకు సాగునీరిచ్చిన చంద్రబాబు
- త్వరలో 24 గంటలూ తాగునీరు కూడా ఇవ్వబోతున్నదీ ఆయనే...
- సీమను అభివృద్ధి చేస్తున్నది చంద్రబాబే అని ఒప్పుకున్న వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి
- 5 ఏళ్లలో రాయలసీమకు జగన్ చేసింది శూన్యం
- సీమ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు
- ఆనాడు జగన్ ను వైసీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదు
- సీమ సాగునీటి ప్రాజెక్టులపై బహిరంగ చర్చ రెడీ...: మంత్రి సవిత

**పెనుకొండ ఆగస్టు 27,అనంత జనశక్తి న్యూస్**



రాయలసీమను సీఎం చంద్రబాబునాయుడు సస్య శ్యామలం చేస్తున్నారని, ఆయన హయాంలోనే సీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు కేటాయించారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రెండేళ్లలో హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు 50 టీఎంసీల కృష్ణా జలాలను తరలించామన్నారు. వైసీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2,011 కోట్లే ఖర్చు చేశారని, 201419 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.12,500 వెచ్చించిందని గుర్తుచేశారు. రాయలసీమ ప్రాజెక్టుల గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఆనాడే జగన్ ను వైసీపీ నేతలు ఎందుకు నిలదీయలేదని మంత్రి సవిత ప్రశ్నించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. అన్న ఎన్టీఆర్ తెలుగు గంట, హంద్రీనీవా, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యూలేటర్ వంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమను సస్య శ్యామలం చేయడానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. 201419 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు వెచ్చించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.6,600 వేల కోట్లకుపైగా ఖర్చు చేశారన్నారు. ఈ రెండేళ్ల కాలంలో హంద్రీ నీవా ద్వారా రాయలసీమకు 52 టీఎంసీల నీటిని తీసుకొచ్చామన్నారు. 19 నియోజక వర్గాల్లో ఉన్న 420 చెరువులను నీటితో నింపామన్నారు. తుంగభద్ర (టీబీ) డ్యామ్ ఆధునీకీకరణ, క్రస్ట్ గేట్ల మార్పిడికి రూ.35 కోట్లు వెచ్చించామన్నారు. రూ.750 కోట్ల వ్యయంతో హంద్రీనీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు పనులకు ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా శ్రీకారం చుట్టామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి సవిత తెలిపారు.

**పులివెందులకు సాగు,తాగునీరిస్తున్న చంద్రబాబు**

కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సాగు, తాగునీరందించడానికి తీవ్రంగా కృషి చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా పులివెందుల నియోజక వర్గానికి 201419 మధ్య సీఎం చంద్రబాబునాయుడు సాగునీరందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, పులివెందులకు తాగు నీరందించడానికి రూ.480 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో మెగా వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే నెలలో ఈ నిర్మాణం పూర్తి కానుందన్నారు. ఈ వాటర్ గ్రిడ్ నిర్మాణంతో 24 గంటలూ పులివెందులకు తాగునీరు అందుతుందని తెలిపారు. పులివెందులకు సాగు, తాగు నీరు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత వెల్లడించారు.

**జగన్ ను ఎందుకు నిలదీయలేదు..?**

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. తన స్వార్థ రాజకీయాల గురించి తప్ప, సీమ అభివృద్ధి గురించి జగన్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం 201419 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు వెచ్చించారన్నారు. తరవాత అధికారంలోకి వచ్చిన అయిదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం రూ.2,011 కోట్లే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.6,600 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామన్నారు. ఇదే విషయం వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సైతం ఆ పార్టీ నాయకులకు వెల్లడించారన్నారు. రాయలసీమ అభివృద్ధి గురించి జగన్ ఏనాడూ దృష్టి సారించలేదని ఆయన అన్నారన్నారు. రాయలసీమ పట్ల చూపుతున్న నిర్లక్ష్యం గురించి ఆనాడు జగన్ ను ఎందుకు నిలదీయలేదని వైసీపీ నాయకులను మంత్రి సవిత ప్రశ్నించారు.

**బహిరంగ చర్చ రెడీ...**

ఎల్ నినో సహా వైసీపీ లేవనెత్తిన సమస్యలపైనా అసెంబ్లీలో చర్చకు రావాలని జగన్ ను ఆహ్వానించినా ముఖం చాటేశారని మంత్రి సవిత మండిపడ్డారు. కావాల్సినంత సమయం మైక్ ఇస్తామని, వైసీపీ హయాంలో లాగా అగౌరపరచమని చెప్పినా అసెంబ్లీకి జగన్ రాలేదన్నారు.

ఇప్పుడు ఎక్కడో కూర్చొని అబద్ధాలు మాట్లాడడం జగన్ కే చెల్లిందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులను స్పష్టం చేస్తున్నానని, రాయలసీమ ప్రాజెక్టులపై బహిరంగ చర్చకైనా సిద్ధంగా ఉన్నామని మంత్రి సవిత సవాల్ చేశారు.

## గుంతకల్లు వాసికి జాతీయ అవార్డు !



- చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారం అందుకున్న - బంటనహాల్ హనుమంతు
- గుంతకల్ ప్రాణదాత సేవా సమితి సేవలకు గుర్తింపు

**గుంతకల్లు, ఆగస్టు 27 :అనంత జనశక్తి న్యూస్**

సమాజ సేవలో విశేషంగా కృషి చేస్తున్న గుంతకల్ ప్రాణదాత సేవా సమితి సభ్యుడు బంటనహాల్ హనుమంతుకు ప్రతిష్ఠాత్మక చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారం లభించింది. గురువారం

గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును అందచేశారు. పొన్నూరు ప్రగడ కోటయ్య కళ్యాణ మండపంలో "మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్" పదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.అదేవిధంగా సమాజంలో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సేవా సంస్థలు, సేవకులను గుర్తించి సత్కరించే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఇందులో భాగంగా గుంతకల్లు ప్రాణదాత సేవా సమితి రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి చత్రపతి శివాజీ మహారాజ్ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీమతి వంగవీటి ఆశ కిరణ్ చేతుల మీదుగా బంటనహాల్ హనుమంతు పురస్కారాన్ని అందుకున్నారు .ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ... ఈ పురస్కారం తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. సమాజానికి మరింత అంకితభావంతో సేవలందించేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ప్రాణదాత సేవా సమితి సభ్యులందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు.స్వచ్ఛంద రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటున్న ప్రాణదాత సేవా సమితి సేవలను గుర్తించి జాతీయ స్థాయి పురస్కారం అందించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## విషాదంలో ఉన్న కుటుంబానికి అండగా

- బాధిత కుటుంబానికి మంత్రి సత్తన్న భరోసా....
- పల్లపు సుధాకర్ కుటుంబ సభ్యుల మృతి పై పరామర్శ....
- ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందిస్తామని హామీ....
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్ :**

శ్రీశైలంలో బత్తలపల్లి మండలానికి చెందిన పల్లపు సుధాకర్ కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటనపై రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. గురువారం బత్తలపల్లిలోని పల్లపు సుధాకర్ ఇంటికి వెళ్లిన మంత్రి.. కుటుంబ సభ్యులు, బంధువులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతుల బంధువులు రాముడు తదితరులు మంత్రి కి తమ ఆవేదనను వివరించారు. కుటుంబ సభ్యులు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల నేపథ్యంలోనే విషాద ఘటన చోటుచేసుకున్నట్లు వారు మంత్రి కి తెలిపారు. కుటుంబ పరిస్థితులను సానుభూతితో అడిగి తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ యాదవ్.. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. క్లిష్ట సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఘటన పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి విషాద పరిస్థితుల్లో బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.



## పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రజల దాహార్తిని తీర్చండి



- నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోండి
- రూ.4 కోట్ల 18 లక్షల నిధులతో త్రాగునీటి అవసరాలు తీర్చేందుకు సహకరించండి
- జెడ్పీ చైర్మన్, సీఈఓను ప్రత్యేకంగా కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.
- జెడ్పీ సమావేశానికి హాజరైన పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి,అనంతపురం ఎంఎల్ఏ దగ్గుపాటి ,హిందూపురం ఎంపీ పార్థసారథి,ఎమ్మెల్సీ రమాదేవి, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు

**అనంతపురం, ఆగస్టు 27:అనంత జనశక్తి న్యూస్**

పుట్టపర్తి నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు. త్రాగునీటి అవసరాల కోసం రూ.4 కోట్ల 12 లక్షల నిధులను జిల్లా పరిషత్ ద్వారా మంజూరు చేసి సహాయ సహకారాలు అందించాలని జెడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి నీ ప్రత్యేకంగా కోరారు.అనంతపురం జిల్లా పరిషత్ హాల్‌లో గురువారం జరిగిన జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న త్రాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.వేసవితో పాటు పలు ప్రాంతాల్లో భూగర్భ జలాల లభ్యత తగ్గడం, బోర్లు ఎండిపోవడం వంటి కారణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఎక్కడా త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా బోర్ల ఏర్పాటు, నీటి సరఫరా, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు జెడ్పీ నిధులను అందించాలని కోరారు.ప్రజల త్రాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం, స్థానిక సంస్థల సహకారంతో నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సురక్షితమైన త్రాగునీరు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్ ,ఎమ్మెల్సీ రమాదేవి, డీసీఎంఎస్ చైర్మన్ వెంకటరాముడు ,ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హుడికి అన్యాయం జరగనీయొద్దు...!!



- నేతన్నకు పథకం అందాల్సిందే....

**ధర్మవరం ఆగష్టు 27 అనంత జనశక్తి న్యూస్ :**

'నేతన్న సేవ' అమలుపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష.. అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి ప్రయోజనం అందేలా చర్యలు ధర్మవరం ఎన్ డీ ఏ కార్యాలయంలో 'నేతన్న సేవ' పథకం అమలు పై మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆర్ డి ఓ చేనేత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పథకం కింద అర్హత ఉన్న వారిలో ఇప్పటివరకు ఎంతమందికి ప్రయోజనం అందింది.. ఇంకా ఎంతమందికి అందలేదు.. అందకపోవడానికి కారణాలేంటి అనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే 'నేతన్న సేవ' పథకం అమలుపై సంబంధిత శాఖ మంత్రి శ్రీమతి సవితమ్మ గారు, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులతో చర్చించిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పథకం అమలులో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్కరికి కూడా అన్యాయం జరగకూడదని, ఎక్కడైనా అర్హుడైన చేనేత కార్మికుడికి పథకం ప్రయోజనం అందకుండా అన్యాయం జరిగితే సహించేది లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి పారదర్శకంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కేవలం పథకాన్ని ప్రకటించడం కాకుండా.. అర్హుడి చేతికి ప్రయోజనం చేరే వరకు బాధ్యతగా పనిచేయాలని అధికారులకు సూచించారు. 'నేతన్న సేవ' పథకం అమలులో ఎలాంటి లోపాలు, జాప్యాలకు తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అర్హులైన చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## శుభకార్యంలో ఆత్మీయ పలకరింపు

- నూతన జీవితానికి మంత్రి ఆశీస్సులు....

**ధర్మవరం ఆగష్టు 27 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తనయుడు చిలకం జయవర్ధన్ రెడ్డి , శ్రావ్య రెడ్డి గార్ల, పెళ్లికొడుకు చేయు కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ శుభకార్యంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ జయవర్ధన్ రెడ్డిని ఆప్యాయంగా పలకరించి ఆశీర్వదించారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న జయవర్ధన్ రెడ్డికి ప్రతి అడుగూ ఆనందంగా సాగాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో నిండిన జీవితం లభించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.










# ప్రభుత్వ హాస్టల్లో కడుపుకు "కోత"



- పూర్తిగా విఫలమైన అధికార యంత్రాంగం
- కన్నెత్తి చూడని పాలకులు
- విద్యార్థులకు శాపంగా మారిన వార్డెన్ల అత్యాశ

అనంతపురం /సత్యసాయి జిల్లా,

ఆగస్టు 27,అనంత జనశక్తి న్యూస్ ;

పిల్లలు దేవుళ్ళతో సమానం అంటారు అటువంటి పిల్లల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ చివరికి వారి వద్దకి వచ్చేసరికి మంచు గడ్డలా మారుతుంది పరిస్థితి. ఇంకేముంది పిల్లలకు అర్ధాకలి, అసంపూర్తి వసతులతో కాలం వెల్లదీయాల్సి వస్తోంది.

**అవును నిజమేనా....**

ప్రభుత్వం ఇస్తున్న ధరల నిధులు ఏములకు సరిపోవడం లేదు.... అందున చెంతాడంత మెనూ...ఇక పిల్లలకు కడుపుకోతలు కాక కడుపు ఎట్లా నిండుతుంది.... మొన్నటి వరకు చికెన్ ధర రూ.280 ప్రభుత్వం ఇచ్చేది ఎంతో తెలుసా ఈ మాత్రం చేయకపోతే ఎలా అంటూ కొందరు వార్డెన్ల వాదన.... అవును నిజమే ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలకు బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలకు చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. ఈ కారణంగా విద్యార్థులకు అర్ధాకళి తప్పడం లేదు...నిజమె కద అనుకునేరు సుమా.... ధరలు ఎన్ని పెరిగినా వార్డెన్లకు వచ్చే నష్టమేంటి... తినేది కొందరైతే తినని వారిని కూడా లెక్క వేయడం లేదా.... అన్నది మేధావులు, విద్యార్థుల తల్లిదండ్రుల గొంతుక.

**నేతల పర్యవేక్షణ కరువాయే.....**

ప్రతి ప్రభుత్వ పాఠశాలను, హాస్టల్లను ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా నెలకు ఒకసారి అయినా పర్యవేక్షించాలని అధిష్టానాలు పదేపదే చెబుతున్న ఏ ఒక్క నేత కూడా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కనిపించడం లేనలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారి పర్యవేక్షణ కొనసాగితే కనీస అధికారులలో అయిన చలనం కలుగుతుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ హాస్టల్ల ద్వారా నేతలకు ఆదాయం...! ఉండదు కదా అందుకేనెమో అటువైపు కన్నెత్తి చూడటానికి ఇష్ట పడటం లేదన్న చర్చ లేకపోలేదు.

**మండల అధికారులు లేరా....**

ఇక మండల అధికారులు అంటారా... వారికి ఉన్నతాధికారులు చెప్పే పనులతోనే బిజీ బిజీగా సతమవుతమవుతూ ఉంటారు. ఇక పర్యవేక్షణ అంటారా అంతా మనమే కదా చూడాల్సింది ఏముంది అన్న రీతిలో వ్యవహరించడం కూడా విద్యార్థుల పాటిట శాపంగా మారింది అని చెప్పవచ్చు.

**ప్రమాదాలతో ప్రాణాలు పోతున్న....**

ప్రభుత్వ హాస్టల్లలో శిథిలావస్థకు చేరిన గదుల వలన ప్రాణాలు పోతున్న ప్రభుత్వాలలో కానీ ప్రభుత్వ అధికారుల లో కానీ చలనం కనిపించడం లేదంటే హాస్టల్ల దుస్థితిపై వారికి ఉన్న నిబద్ధత ఏ పాటిదో అర్థమవుతోంది. పేద ప్రజలు వారి పిల్లల భవిష్యత్తుపై కలలుగని ప్రభుత్వ హస్టల్లలో వదిలింది ప్రాణాలు పోగొట్టుకునేందుకేనా...?. అన్నది ఇప్పుడు వినిపిస్తున్న చర్చ. కళ్యాణదుర్గం నియోజకవర్గం శెట్టూరు మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ లో 153 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోవడంతో హాస్టల్ వెలుపల ఉన్న ప్రాంతానికి వెళ్లడం జరుగుతుంది. ఈ కోవలో గతంలో నిర్మించి అర్ధాంతరంగా వదిలేసిన గోడల వద్ద బహిర్భూమి నిర్వహిస్తుండగా ఒకసారిగా గోడకూలి విద్యార్థుల మీద పడటంతో ఎనిమిదవ తరగతి చదువుతున్న కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామానికి చెందిన హర్షవర్ధన్ తేజ మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్ర గాయాలపై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీన్నిబట్టి చూస్తే అర్థమవుతుంది ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థుల దయనీయ పరిస్థితి ఎలా ఉందన్నది.

**ఎమ్మెస్ రాజు తనిఖీలతో ...**

మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హాస్టల్లలో పనితీరుపై కొత్త ఒరవడికి నాంది పలికారు. నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను, హాస్టళ్లను తనదైన శైలిలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలను కొనసాగినిస్తూనే ఉన్నారు. తాను స్వయంగా హాస్టల్లో తనిఖీకి వెళ్ళినప్పుడు అందులో నెలకొన్న భోజన వసతులను, ఆడపిల్లలకు అవసరమైన మౌలిక వసతులను చూసి చలించి పోయిన అయన తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి సొంత నిధులతో నాంది పలికిన ఏకైక ఎమ్మెల్యే ఆయనే అని చెప్పవచ్చు. ఎండిన కూరగాయలను, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని ఏ విషయంలో కూడా ఆయన రాజీ పడకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఒక్కసారిగా ఆయన ఆకస్మిక తనిఖీలను చేపట్టడంతో ప్రతి ప్రభుత్వ హాస్టల్ల వార్డెన్లు, అధికారులలో మార్పు కనిపించింది. దీంతో విద్యార్థుల అర్థ ఆకలి సైతం తొలగిపోయిందని చెప్పవచ్చు. అంతేకాకుండా హాస్టల్లలో ఓ ఫిర్యాదు బాక్స్ ను ఏర్పాటు చేయించి వాటికి సంబంధించిన తాళాలను సైతం ఆయన వద్దనే ఉంచుకొని తిరిగి తనిఖీలకు వెళ్ళినప్పుడు వాటిని ఆయనే స్వయంగా చదవడం, సమస్యలను పరిష్కరించడం కూడా ఓ గొప్ప నాంది అని చెప్పవచ్చు.

**తలుపుల మండలంలో...**

తలుపుల గ్రామంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో అదనపు గదులు నిర్మాణంలో ఉండడంవల్ల విద్యార్థులు తరగతి గదులతో ఇబ్బందులు పడుతున్నారు. గదులు సరిపోక ఆరు బయట ఆవరణంలో కూర్చొని విద్యను
బోధిస్తున్నారు.
గతంలో ఉన్న బీసీ హాస్టల్ ను మూత వేయడం వలన ప్రస్తుతం హాస్టలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

**పుట్లూరు మండలంలో.....**

మండలంలో బీసీ హాస్టల్ లో 190 మంది విద్యార్థులు ఉండగా వీరందరికీ ప్రధాన సమస్య నీటి సమస్య. వ్యక్తిగత మరుగుదొడ్ల సమస్యతో విద్యార్థులు ఆరు బయటకే మల విసర్జనకు వెళ్ళవలసి వస్తుంది. అలాగే నీటికి కటకట ఉండడంతో విద్యార్థులే కాలనీలలో నుండి బకెట్ల ద్వారా నీటిని తెచ్చుకొని ఆరుబయటే స్నానాలు చేయాల్సి వస్తోంది. దీనిపై సదరు వార్డెన్ అధికారులకు, నాయకులకు ఎన్ని మార్లు చెప్పిన ఏ ఒక్కరు పట్టించుకోలేదు దీంతో అధికారులకు విద్యార్థులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు.

**ధర్మవరం పట్టణంలో....**

వైయస్సార్ కాలనీ ఇందిరానగర్ పరిధిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో సరైన నీటి వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు . మరోవైపు డైనింగ్‌హాల్, వంటగదిలోనూ పరిశుభ్రత కొరవడింది. వంటగదిలో ఆహారం తయారీ, నిల్వ చేసే ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాల్సి ఉండగా.. నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.
మరుగుదొడ్లలో దుర్వాసన, స్నానపు గదులను సరిగా శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది.
హాస్టల్లోని నీటి శుద్ధి ప్లాంట్ పనిచేయకపోవడంతో బోరు నీరే విద్యార్థులకు దిక్కు వుతోంది.

**రాప్తాడు మండలంలో...**

మండల కేంద్రంలో ఉన్నటువంటి బాలుర వసతి గృహంలో 113 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ విద్యార్థులకు మరుగుదొడ్లు, బాత్రూం డోర్లు దెబ్బతిన్నాయి.
వర్షం వస్తే పిల్లలు చదువుకోనేందుకు ఆధారమైన వరండ సైతం నీరు కారుతుండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. అలాగే ఆదర్శ పాఠశాల, కస్తూరిబా పాఠశాలల్లో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడటం వల్ల విద్యార్థులకు అసౌకర్యాలు నెలకొంటున్నయని, పాఠశాలలకు సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**నల్లచెరువు మండలంలో.....**

మండల కేంద్రంలోని బిసి హాస్టల్లో 78 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి అందాల్సిన మౌలిక వసతులు అందక పిల్లలకు అవస్థలు తప్పడం లేదు. పిల్లలు తినడానికి కావలసిన ప్లేట్లు, గ్లాసులు, దుస్తులు పెట్టుకోవడానికి పెట్టెలు, కప్పుకోవడానికి దుప్పట్లు కూడా పూర్తిస్థాయిలో అందకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. అలాగే పిల్లలకు స్నానాలు చేయడానికి మరుగుదొడ్లు చాలావరకు పాడయ్యాయి. నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లు అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**పుట్టపర్తి మండలంలో...**

మండలంలోని ఆదర్శ పాఠశాలలో సమస్యలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా విద్యార్థులకు తాగడానికి ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు చేరుకోవడంతో విద్యార్థులకు బోరు నీరే తప్పడం లేదు. అలాగే విద్యార్థులకు బస్ సౌకర్యం సరిగా లేక దాదాపుగా 110 మంది విద్యార్థులు ఒకే బస్ లో ప్రయాణించాల్సి వస్తోంది. ఇందులో 60 మంది పై గా ఆడపిల్లలే ఉండడంతో వారికి కాస్త ఇబ్బందికరంగా ఉందని మరో బస్సును ఏర్పాటు చేయాలంటూ అక్కడి విద్యార్థులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.




## యల్లనూరు మండలంలో...

యల్లనూరు మండల వ్యాప్తంగా మూడు ప్రభుత్వ హాస్టల్లు ఉన్నాయి. ఆదర్శ పాఠశాలలో 90మంది విద్యార్థినిలకు సరైన మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. హాస్టల్ భవనంలోని నేలపరుపు పూర్తిగా దెబ్బ తినడం, కిటికీ అద్దాలు ధ్వంసం అవ్వడం, వ్యక్తిగత మరుగుదొడ్ల సైతం అసంపూర్తిగా పనిచేస్తుండటంతో వాటి మరమ్మత్తుల కోసం రూ.15 లక్షల నిధులు మంజూరు అయినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో గత కొన్ని నెలలుగా పనులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యార్థినులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అలాగే కస్తూరిబా పాఠశాలలో 250మంది విద్యార్థులు ఉండగా గదుల కొరతతో ఇబ్బందులకు గురవుతున్నారు. నాడు-నేడు ద్వారా జరుగుతున్న భవనం నిర్మాణం పలులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులకు గదుల కొరత తప్పడం లేదు. ఇక బీసీ హాస్టల్ విషయానికొస్తే 57మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. ఇటీవల ప్రభుత్వం రూ.35 లక్షల నిధులతో హాస్టల్ మరమ్మతులు చేయించిన అందులోని భోజన సౌకర్యంలో విద్యార్థులకు మాత్రం కడుపు కోత తప్పడం లేదు. విద్యార్థులకు ఆర కొరకు భోజనాన్ని ఇవ్వడం వల్ల చాలామంది విద్యార్థులు ఇంటి వైపు పరుగులు తీస్తున్నారు. అనంత జనశక్తి తనిఖీలో 38 మంది విద్యార్థులకు గాను రెండు కేజీల చికెన్ ను వండి విద్యార్థులకు చాలీ చాలని భోజనాన్ని వడ్డించడం విశేషం.



## వసతులు కరువు ....

సత్య సాయి, అనంతపురం జిల్లాలో దాదాపు 73 పైగా ప్రభుత్వానికి సంబంధించిన హాస్టల్లో ఉన్నాయి. ఇందులో కస్తూరిబా, ఆదర్శ పాఠశాలల హాస్టల్లలో వసతులు కాస్త మెరుగ్గా ఉండగా బీసీ, ఎస్సీ ఎస్సీ హాస్టల్లలో పరిస్థితి మాత్రం దుర్భరంగానే ఉందని చెప్పవచ్చు. వాటిలో విద్యార్థుల మౌలిక వసతులను చూస్తే భయానక పరిస్థితులు ఉన్నాయి. కొన్నిచోట్ల దెబ్బతిన్న గోడలు, శిదిలమైన బండ పరుపులు(గ్రౌండ్ ఫ్లోర్), బాత్రూం లకు, వ్యక్తి గత మరుగుదొడ్లు తాళాలు వేసిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. నిజంగా చెప్పాలంటే హాస్టల్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులే మూలుగుతూ మూలన పడితే ఇక అక్కడ విద్యార్థులకు అందుతున్న సేవలు ఏంటి అన్నది శతకోటి ప్రశ్న...? విద్యార్థులకు అవసరమైన వసతులను పట్టించుకోలేని దీనస్థితిలో ప్రభుత్వాలు ఉండిపోయాయ...? అటువంటప్పుడు హాస్టల్లను ఎందుకు కొనసాగిస్తున్నారు అన్నది కూడా మరో ప్రశ్న. మరికొన్ని పాఠశాలల్లో నీటి సౌకర్యాలు లేక విద్యార్థులు బహిర్భూమికి ఆరు బయటకు వెళ్లడం, ఆరుబయట కాలనీలలో నుండి బిందెలు, బకెట్లతో నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.





# ప్రశ్నించేది.. జవాబు వెతికేది సైన్స్ మాత్రమే...!!

- విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించడమే చెకుముకి లక్ష్యం.
- డాక్టర్ బషీర్

ధర్మవరం ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్:




విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్ తెలిపారు.జెవివి ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా పాఠశాల స్థాయి పరీక్షను స్థానిక గణేష్ మున్సిపల్ హైస్కూల్ లో ఇంచార్జీ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి డాక్టర్ బషీర్ ముఖ్య అతిథిగా హాజరైమాట్లాడారు. శాస్త్రీయ విద్యావిధానం వల్లే ఈ సమాజంలో మూఢనమ్మకాలు తగ్గి సమాజం అభివృద్ధి చెందుతుందన్నాడు...ప్రశ్నే సైన్స్ కు ప్రాణమని, ప్రశ్న లేనిదే సైన్స్ లేదని, లక్షల ప్రశ్నలకు జవాబులు వెతికే క్రమంలోనే శాస్త్రవేత్తలు ఎన్నో ఆవిష్కరణలు చేశారని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వల్లనే మానవ సమాజం ఎంతో లాభ పడిందన్నారు.
జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ.... దేశ పురోగమనానికి, మనిషి జీవన సౌలభ్యానికి శాస్త్ర సాంకేతిక రంగాలు అత్యంత కీలకమనీ గ్రహించిన మన మొదటితరం పాలకులు శాస్త్రజ్ఞానాన్ని విస్తరింపజేయాలని, పౌరుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని ఆశించారన్నారు. అందుకే మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ (హెచ్)లో ఆ విషయాన్ని పొందుపరిచారన్నారు. సైన్స్ ను హేళన చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా చీకటి సామ్రాజ్యాలను నిర్మించుకున్న బాబాలు, స్వామీజీలకు ప్రభుత్వాల నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతుగా నిలవడమే కాకుండా సైన్స్ ను అపహాస్యం చేస్తూ తరగతి గదిలోకి మూఢనమ్మకాలను, అశాస్త్రీయ భావజాలాన్ని చొప్పి స్తున్నారన్నారు. దీన్ని అడ్డుకోవడం ఈ దేశ అభివృద్ధి కీ అత్యంత అవసరం అని తెలిపారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే సూడో సైన్స్ ను నమ్మకుండా ప్రశ్నించాలన్నారు... అనంతరం ప్రశ్న పత్రాలు విడుదల చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి. లోకేష్, ఉపాధ్యాయులు జింకా హరి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకు అధికారులు కీలక పాత్ర పోషించాలి

- డి.ఎస్. పి. జగన్నాథ్ రాజు.

ధర్మవరం ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్:




బ్యాంకుల్లో దొంగతనాల నివారణతో పాటు సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకు అధికారులు కీలక పాత్ర పోషించాలని డి.ఎస్.పి జగన్నాథ్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులతో వారు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ....

**బ్యాంకుల్లో భౌతిక దొంగతనాల నివారణ హాలో భాగంగా సీసీటీవీ**

కెమెరాలు – బ్యాంకు లోపల, బయట, ఏటీఎంలు , ప్రవేశ ద్వారాలు, నగదు కౌంటర్ల వద్ద 24×7 పనిచేసే విధంగా ఏర్పాటు చేయాలి అని తెలిపారు. సీసీటీవీ బ్యాకప్ – రికార్డింగ్ కనీసం నిర్ణీత కాలం భద్రంగా ఉండేలా చూడాలి. కెమెరాలు పనిచేయకపోతే వెంటనే మరమ్మతులు చేయాలి అని తెలిపారు.అలారం వ్యవస్థ – అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు సమాచారం అందేలా సెక్యూరిటీ అలారం పనిక్ అలారం ఏర్పాటు చేయాలి అని తెలిపారు. అదేవిధంగా
రాత్రి భద్రత – అవసరమైన చోట సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి, వారి విధులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి అని తెలిపారు.
నగదు తరలింపు – అధిక మొత్తంలో నగదు తరలించే సమయంలో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి అని తెలిపారు.అనుమానాస్పద వ్యక్తులపై నిఘా – బ్యాంకులో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు, తరచూ వచ్చే అనుమానాస్పద కస్టమర్లపై అప్రమత్తంగా ఉండాలి అని తెలిపారు. సైబర్ దొంగతనాల నియంత్రణలో బ్యాంకు అధికారుల పాత్ర అసాధారణ లావాదేవీల గుర్తింపు – కస్టమర్ సాధారణ లావాదేవీలకు భిన్నంగా జరిగే పెద్ద మొత్తాల లేదా వరుస లావాదేవీలను వెంటనే గుర్తించే వ్యవస్థ ఉండాలి అని తెలిపారు.

# ఆ కాంట్రాక్టర్లపై మీకెందుకు అంత ప్రేమ..?

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- 4పంచాయతీల్లో తాగునీటి పనులను వెంటనే పూర్తి చేయాలన్న దగ్గుపాటి
- వైసీపీ సభ్యుల ప్రశ్నలకు ధీటుగా సమాధానం ఇచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- కూటమి ప్రభుత్వం అన్ని సమస్యలపై చిత్తశుద్ధిగా ఉందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం ఆగస్ట్ 26, అనంత జనశక్తి న్యూస్**



రెండేళ్లుగా పనులు చేయకున్నా... ఎందుకు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోలేదని..ఆ కాంట్రాక్టర్లపై మీకు ఎందుకు అంత ప్రేమ అని అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నిలదీశారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీ పార్థసారథి గారు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి గారు, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. నాలుగు పంచాయతీలలో ఉన్న తాగు నీటి సమస్యలను ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. గత రెండేళ్లుగా పనులు చేయకున్నా..ఎందుకు కాంట్రాక్టర్లను తొలగించలేదని ఈ విషయంపై ఎన్నో సార్లు ఫిర్యాదు చేసిన ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చామని అధికారులు వివరించినా.. రెండేళ్లుగా ఇలాగే ఉంటే వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కోవాలని ప్రశ్నించారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆ కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారికి పనులు అప్పజెప్పి పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు సభలో వైసీపీ నాయకులు గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ధీటుగా స్పందించారు. ఇందులో ముఖ్యంగా హెచ్.ఎల్.సి, హంద్రీనీవా కాలువల నుంచి వచ్చే నీటిని... సాగుకు ఇవ్వాలని వైసిపి నాయకులు డిమాండ్ చేయగా.. ఈసారి సూపర్ ఎల్‌నినో ప్రభావం ఉండటం వలన కేవలం తాగునీటికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లలో ఏ రోజైనా హంద్రీనీవా, హెచ్.ఎల్.సి కాలువల గురించి పట్టించుకున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీనీవాకు ప్రత్యేక విధులు కేటాయించారని పేర్కొన్నారు. అలాగే జడ్పిటిసి, ఎంపీటీసీలు అలవెన్స్ లు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని తప్పుపట్టే ప్రయత్నం చేశారు. దీనిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఘాటుగా స్పందించారు. గత సమావేశాల్లో మీరు ఈ విషయాన్ని చెప్పి ఉంటే.. కచ్చితంగా ఇప్పటికే వాటిని చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునేదని అన్నారు. అప్పుడు చెప్పకుండా ఇప్పటికిప్పుడు ఏదో జరిగిపోయింది అన్నట్టుగా చెప్పడం ఏంటని నిలదీశారు. అలాగే గత ప్రభుత్వంలో వీటి గురించి ఏరోజైనా నిలదీశారా అని సభ్యులను ప్రశ్నించారు. వసతి గృహాలు పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయంటూ వైసీపీ నాయకులు చెప్పగా మంత్రి నారా లోకేష్ వచ్చిన తర్వాతే విద్యా శాఖలో అనేక మార్పులు వచ్చాయని... ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరుతున్నారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమాధానం ఇచ్చారు.

## నూతన వధూవరులకు మంత్రి ఆశీస్సులు

**ధర్మవరం ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం రిపోర్టర్స్ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కేశగాళ్ల శ్రీనివాసులు కుమార్తె ప్రియాంక-గోపాలకృష్ణ నూతన దంపతులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గురువారం వారి స్వగృహంలో కలిసి ఆశీర్వదించారు. నూతన వధూవరులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి స్వగృహానికి విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



## వడ్డెరలకు పెద్దపీట వేసింది టీడీపీనే..

- వడ్డెర సంఘం పోరాటంతోనే రమాదేవికి ఎమ్మెల్సీ పదవి
- విలేకరుల సమావేశంలో దేవళ్ళ మురళి

**అనంతపురం, ఆగస్టు 27 :అనంత జనశక్తి న్యూస్**



వడ్డెర కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎన్నో సంవత్సరాలుగా రాష్ట్రంలోని వడ్డెర ప్రజానీకం ఎన్నో పోరాటాలు చేసిందని, దీని ఫలితంగానే దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి దక్కిందని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ళ మురళి పేర్కొన్నారు. గురువారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడ్డరులకు రాజ్యాధికారం కావాలని, చట్టసభల్లో అవకాశం కల్పించాలని.. ఎన్నో ఏళ్ల నుండి తన పోరాటం కొనసాగిస్తున్న విషయం రాష్ట్ర ప్రజలకు, వడ్డెర కులస్తులకు తెలిసిందేనన్నారు. అయితే ఈ పోరాటాల ఫలితంగానే దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కేటాయించడం జరిగిందని, రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వడ్డేరులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కోసం ఎంతో మంది వడ్డెర కులానికి చెందిన ఆశావహులు ఉన్నప్పటికీ ఆ పదవి వడ్డెర మహిళకు చట్టసభల్లో అవకాశం కల్పించారన్నారు. వడ్డెర సంఘంలో కొంత మంది నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సమావేశాల ద్వారా, సోషల్ మీడియా ద్వారా రమాదేవికి తామే పదవి ఇప్పించామనడం హాస్యాస్పదమన్నారు. ఇలాంటివి మానుకోవాలని సూచించారు. రమాదేవి రాజకీయ రంగప్రవేశానికి తానే ముఖ్య కారణమని 2021 సంవత్సరంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరితో మాట్లాడి అనంతపురం కార్పొరేషన్ 47వ డివిజన్ కార్పొరేటర్‌గా తెలుగుదేశం పార్టీ నుండి అవకాశం కల్పించారన్నారు. అయితే స్వల్ప మెజారిటీతో ఆమె అప్పుడు ఓటమి చెందిందని, ఇది అందరికీ తెలిసిందేనన్నారు. అనంతరం రమాదేవికి డివిజన్ అంగన్వాడి అధ్యక్షురాలిగా, యూనిట్ ఇన్చార్జిగా అప్పట్లో పదవి ఇప్పించామని గుర్తు చేశారు.
రమాదేవి కూడా అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీ అభివృద్ధికి కృషి చేసిందని అభినందించారు. ఇవన్నీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చొరవతోనే జరిగాయని అందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు, ఎన్నో కార్యక్రమాలు చేసి వడ్డెర కులాన్ని వెలుగులోకి తెచ్చింది తానేనని, ఇది అందరూ గమనించాలని కోరారు. అనేక పోరాటాల వల్లనే వడ్డెర కార్పొరేషన్ చైర్మన్, గ్రంథాలయ చైర్మన్‌తో పాటు మరెన్నో పదవులు కులానికి లభించాయన్నారు. వడ్డెర కులస్తులకు రాజకీయంగా, రాజ్యాంగ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, మంత్రి నారా లోకేష్‌ను పలుమార్లు కోరానని గుర్తు చేశారు. రమాదేవికి ఎమ్మెల్సీ పదవి రావడం పట్ల తాము కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నామని, ఆమెతో కలిసి పని చేయడానికి కులం అభివృద్ధి కొరకు కృషి చేయడానికి వెనుకాడబోమని తెలిపారు. మనమందరం కలిసి తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం, వడ్డెర కులం అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగనమల పీట్ల రవీంద్ర, వల్లెపు కృష్ణ, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలపై ప్రజాభిప్రాయ సేకరణ అధికారులు..

- గ్రామసభ వేపరాల..

**గాండ్లపెంట, ఆగస్ట్, 27, అనంత జనశక్తి న్యూస్,**

మండలంలోని వేపరాల, కురుమామిడి పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గురువారం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. వేపరాలలో కేంద్రం ఏర్పాటుపై గ్రామస్తుల మధ్య భిన్నాభిప్రాయాలు రావడంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. ఎస్సై సుమతి పోలీసు సిబ్బందితో పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదించి, వారి ఆదేశాల మేరకు ఈ నెల 30న పోలింగ్ కేంద్రాలను ప్రకటిస్తామని తెలిపారు. కురుమామిడి పంచాయతీ రెక్కమాను సచివాలయంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు పద్మనాభరెడ్డి, సునీత, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, హనుమంతరెడ్డి, మాజీ సర్పంచ్ సీఎన్‌పి సుధాకర్, లోకేష్, డాక్టర్ ఖాజావలి, సులేమాన్, చంద్ర, బాదుల్లా, మల్లికార్జున నాయుడు, పాయకట్టు, రెక్కమాను, పోతులవాండ్లపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు..

## న్యూ వికాస్ లో విద్యార్థులకు అవగాహన

**యాడికి, ఆగష్టు 27, అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉన్న విద్యార్థులకు గురువారం సిఐ శ్రీనివాసులు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు .ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు ప్రతి విద్యార్థి ఇతరులను గౌరవిస్తూ, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తూ, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిస కావడం వల్ల కలిగే అనర్థాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సలహాలను పాటించాలని సూచించారు. మహిళలు బాలికల భద్రతకు సంబంధించిన శక్తి యాప్ గురించి కూడా వివరించి, అవసరమైన సమయంలో అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలను ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేశారు. భారత రాజ్యాంగం, పౌరుల హక్కులు , బాధ్యతలు, చట్టాలను గౌరవించడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలను పాటిస్తూ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. విద్యార్థులకు మానవతా విలువలు, మంచి నడవడి, క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత వంటి అంశాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**కళ్యాణదుర్గం ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్**

బెలుగుప్ప మండలం రవనేపల్లి క్రాస్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.ఈ ప్రమాదంలో కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బెలుగుప్ప నాగరాజు (60),కోమటి గుప్తా (45) మృతి చెందారు. బెలుగుప్ప నాగరాజు కళ్యాణదుర్గంలో శ్రీ లలితా సిల్క్ & సారీస్ యజమానిగా ఉన్నారు.అదే కారులో ప్రయాణిస్తున్న బలిజ నరహరి, కోమటి హర్షలకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు అక్కడ చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన వారి మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.బెలుగుప్ప నాగరాజు పట్టణంలో బట్టల దుకాణం వ్యాపారిగా అందరికీ సుపరిచితుడు. మృదు స్వభావి ఐన నాగరాజు, గుప్తా మృతి పట్ల పట్టణ ప్రజలు, వర్తకులు, ఆర్యవైశ్య సంఘం నేతలు, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించాలని వేడుకున్నారు.



## హాకీలో బాలికలు విన్నర్స్... బాలురు రన్నర్స్

- బాలికల హాకీ ఛాంపియన్ శ్రీ సత్యసాయి జిల్లా జట్టు
- ద్వితీయ స్థానం లో పురుషులహాకీ జట్టు.
- ఆంధ్రప్రదేశ్ హాకీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగష్టు 27, అనంత జనశక్తి న్యూస్:**





స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతి లో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్ షిప్ 2026 హాకీ విభాగం లో శ్రీసత్య సాయి బాలికల హాకీ జట్టు కాకినాడ జిల్లా జట్టుపై 42 గోల్స్ తేడాతో విజయం సాధించి విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. అలాగే పురుషుల హాకీ విభాగంలో సత్యసాయి జిల్లా హాకీ జట్టు ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.ఫైనల్ మ్యాచ్ లో అనకాపల్లి జిల్లా జట్టుతో 30 గోల్స్ తేడాతో ఓటమి చెంది రన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. అలాగే బాలికల విభాగంలో సత్య సాయి జిల్లాకు చెందిన నవ్య అండర్ 17 బాలికలవిభాగంలో బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును దక్కించుకుంది , పురుషుల విభాగంలో బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును సత్యసాయి జిల్లా క్రీడాకారుడు నవీన్ దక్కించుకున్నాడు గెలుపొందిన జట్లకు ఆగష్టు 29 స్పోర్ట్స్ డే సందర్భంగా బహుమతులను అందజేయనున్నారు. గెలుపొందిన జిల్లా జట్లను శ్రీసత్య సాయి జిల్లా
జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కిషోర్, హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సత్య సాయి జిల్లా సెక్రటరీ సూర్య ప్రకాష్, ట్రెజరర్ అంజన్న సత్యసాయి జిల్లా హాకీ కోచ్ హుసేన్, హాకీ సత్య సాయి జిల్లా జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్ బాలుర, బాలికల జట్టు సభ్యులను అభినందించారు.

## నేపాల్ వరద బాధితులకు హెల్ప్ లైన్

- సత్యసాయి జిల్లావాసులకు హెల్ప్‌లైన్ ఏర్పాటు.
- ఆర్డిఓ రాంభూపాల్ రెడ్డి.

**ధర్మవరం ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్:**




శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు ధర్మవరం రెవెన్యూ డివిజన్ లోని ధర్మవరం టౌన్, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి, కనగానపల్లి, రామగిరి, చెన్నె కొత్తపల్లి మండలాలకు చెందిన ప్రజలు ఎవరైనా నేపాల్ వరదలలో చిక్కుకున్నట్లయితే వెంటనే జిల్లా కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 08555 289039 నకు సమాచారం అందించాలని ఆర్డిఓ రాంభూపాల్ రెడ్డి తెలిపారు. బాధితుల వివరాలు అందించినట్లయితే, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారిని సురక్షితంగా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చేందుకు జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## రైతు పొలాన్ని పరిశీలించిన ఉద్యానశాఖ అధికారులు



**రాప్తాడు ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామంలో రైతు శివాశంకర్‌శెట్టి సాగు చేస్తున్న పీఎండీఎస్ (PMDS) ఫీల్డ్‌ను ఉద్యానశాఖ ఉన్నతాధికారులు గురువారం పరిశీలించారు. రైతు పొలంలో మునగ, దానిమ్మ, సపోటా, మామిడి, కొబ్బరి, చీని, మెకాడమియా, నేరేడు, జామ, పనస, నిమ్మ, కుంకుడు, సీతాఫలం, రామఫలం తదితర ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. ప్రధాన పంటగా సజ్జను సాగు చేస్తున్నారు.ఈ సందర్భంగా పీఎండీఎస్ ఫీల్డ్‌లో పంటల సాగు విధానం, వివిధ రకాల ఉద్యాన పంటల పరిస్థితిని అధికారులు పరిశీలించి రైతుతో వివరాలు తెలుసుకున్నారు. ఉద్యాన పంటల సాగుతో రైతులకు కలిగే ప్రయోజనాలు, పంటల నిర్వహణ తదితర అంశాలపై పరిశీలన జరిపారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, సీటీ అండ్ ఐఓ శ్రీ లక్ష్మణ్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి (డీహెచ్‌ఓ) ఉమాదేవి, పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏడీహెచ్ ధనుంజయ, ఏపీడీ చంద్రశేఖర్, డివిజనల్ ఉద్యానశాఖ అధికారులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మదర్ థెరిసా జన్మదిన వేడుకలు..

### పేద మహిళలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎస్సై సుమతి...

**గాండ్లపెంట, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్,**

మండల కేంద్రంలోని పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు నెల రోజులుగా పొదుపు చేసిన డబ్బుతో కూలీ పనులు చేసుకునే ఇద్దరు మహిళలకు నిత్యావసర సరుకులను అందించారు. చిన్న వయసులోనే సేవా గుణాన్ని అలవర్చుకోవడం అభినందనీయమని ఎస్ఐ సుమతి తెలిపారు. మదర్ థెరిసా సేవా స్ఫూర్తిని విద్యార్థులు ఆచరణలో చూపించడం అభినందనీయమని ఉపాధ్యాయులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణరెడ్డి, మురాద్‌షావలి, హరిప్రసాద్, రాజశేఖర్, తాహెర్‌వలి, శేషు, వెంకటేష్, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు..



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | అనంతపురం
28.08.2026



# రేపటి నుండి రాఘవేంద్రస్వామి 355వ ఆరాధన మహోత్సవం

యాడికి, ఆగష్టు 27, అనంత జనశక్తి న్యూస్ :



మండల కేంద్రంలోని రాఘవేంద్ర స్వామి కాలనీలో ఉన్న శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయంలో 355వ ఆరాధన మహోత్సవం (యాడికి లో 5వ )ను నిర్వహిస్తున్నట్లు గురువారం ఆలయ కమిటీ సభ్యులు పోసా చౌడయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పోసా చౌడయ్య మాట్లాడుతుఈ నెల 29 శనివారం న పూర్వారాధన కార్యక్రమం నిర్వహించబడునని, ఉదయం 5 గంటలకు నిర్మల్య విసర్జనము, వేద పారాయణం,7 గంటలకు అష్టోత్తర పారాయణ, సహిత క్షీరాభిషేకము, పంచామృతాభిషేకం, 9 గంటలకు అలంకారము, తులసి అర్చన, హస్తోదకము, మహామంగళహారతి తీర్థప్రసాదం వినియోగ కార్యక్రమం నిర్వహించబడునని,ఈ నెల 30 ఆదివారం న మధ్వరాధన, ఉదయం 5 గంటలకు నిర్మల్య విసర్జనము, ఉదయం 7 గంటలకు శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనమునకు పురుషసూక్త విధానమున పంచామృతాభిషేము, విశేషాలంకారములు జరుగునని తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు అన్న సంతర్పణము జరుగునని, సాయంత్రం 5 గంటలకు శ్రీ స్వామి వారి రథోత్సవము, తదనంతరం మహామంగళహారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 31 న సోమవారం ఉత్తరారాధన , ఉదయం 5 గంటలకు నిర్మల్య విసర్జనము, ఉదయం 7గంటలక అష్టోత్తర పారాయణ సహిత క్షీరాభిషేకము, పంచామృతాభిషేకం, ఉదయం 9 గంటలకు అలంకారము, తులసి అర్చన, హస్తోదకము, మహామంగళహారతి తీర్థప్రసాదం వినియోగం జరుగునని తెలిపారు. భక్తులు శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవంలో పాల్గొని,ధన ధాన్య వస్తురూపేణ సమర్పించి, శ్రీ రాఘవేంద్ర స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# బిజెపి,జాతీయ,నాయకుడు,ఎస్, విష్ణువర్ధన్,రెడ్డి,కి ఘనంగా,స్వాగతం,



అమడగూరు ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్

అమడగూరు స్థానిక మండల చౌడేశ్వరి కళ్యాణమండపం కేంద్రంలోని మండల బిజెపి నాయకులు విలేకర్ల, సమావేశం,నిర్వహించారు ఈ సమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్, 592026 తేదీన మధ్యాహ్నం 12 గంటలకు బిజెపి జాతీయ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి జాతీయస్థాయిలో గుర్తింపు పొంది అంచలంచలుగా ఎదిగి భారతీయ జనతా పార్టీలో ఆల్ సెల్ఫ్ కోఆర్డినేటర్ గా నియమితులైన ఢిల్లీ నుండి బెంగళూరులో ఎయిర్పోర్ట్లో దిగి రోడ్డు మార్గంలో కోడికొండ చెక్పోస్టులో నుండి తన జన్మస్థలమైన శ్రీ సత్య జిల్లా కదిరికి మొట్టమొదటిసారిగా విచ్చేయనున్న సందర్భంగా అమడగూరు మండలం నుంచి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొని కోడికొండ చెక్పోస్ట్ నుండి కదిరి వరకు బిజెపి నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో వివిధ వాహనాలతో భారీగా స్వాగతం పలికి విజయవంతం చేయాలని మండల బిజెపి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఈ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల బిజెపి నాయకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల,బిజెపి అధ్యక్షుడు రామిశెట్టి వేమనారాయణ, మేకల శ్రీనివాసులు, సురేందర్ రెడ్డి సుబ్బిరెడ్డి, ఉత్తమ రెడ్డి , రామచంద్ర రెడ్డి, బుధిలి సుదర్శన్, హరినాయక్ సోమగుట్ట జై చంద్ర రెడ్డి, , రఘునాథ్ రెడ్డి, గంగులప్ప తిప్పన్న అంజి, లక్ష్మీనారాయణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బి.ఎడ్. కళాశాలకు నూతన డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్



అనంతపురం, ఆగస్టు 27:అనంత జనశక్తి న్యూస్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బి.ఎడ్. కళాశాలకు నూతన డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లను నియమిస్తూ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.బి.ఎడ్. కళాశాల డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఎస్.ఆర్. సదాశివ రెడ్డి, ప్రిన్సిపాల్‌గా డా. ఆర్. రాముడు, వైస్ ప్రిన్సిపాల్‌గా డా. వి. అనిత నియమితులయ్యారు.ఈ సందర్భంగా రెక్టర్ ప్రొఫెసర్ బి. అనిత, రిజిస్ట్రార్ డా. ఇ. రమేష్ బాబు సమక్షంలో ఉపకులపతి నూతనంగా నియమితులైన వారిని అభినందించారు. కళాశాలలో విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించడంతో పాటు బోధనలో నాణ్యతను మెరుగుపరచి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.నూతనంగా నియమితులైన డైరెక్టర్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌లు త్వరలో తమ బాధ్యతలను స్వీకరించనున్నారు.

# ఎమ్మెల్యే అమిలినేని చొరవతో మారిన అంగన్వాడీ రూపురేఖలు

- ఎమ్మెల్యే అమిలినేని కి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

కళ్యాణదుర్గం ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం అపిలేపల్లి గ్రామంలోని అంగన్వాడీ 3 భవనం నిర్మాణం పూర్తి అయినా రంగులు వేయకుండా, సరైన వసతులు కూడా కల్పించకుండా గత ప్రభుత్వం గాలికి వదిలేశారని గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన స్వంత నిధులు వెచ్చించి చిన్నారులు చదువుకునే అంగన్వాడీ భవన రూపు రేఖలు మార్చడం జరిగింది. దీంతో గ్రామస్థులు, అంగన్వాడిలో చదువుకునే చిన్నారుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు కి కృతజ్ఞతలు తెలిపారు...



# రూ.1437 కోట్లతో రాజధాని గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన







- ఇప్పటికే కేటాయించిన రూ.904 కోట్లకు అదనంగా మరో రూ.533 కోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్
- కొత్తగా ల్యాండ్ పూలింగ్ కు భూములిస్తున్న వారికి గరిష్టంగా రూ 1.5 లక్షల రుణమాఫీ
- ఇప్పటికే భూకేటాయింపులు చేసిన వారికి అదనపు భూముల కేటాయింపునకు నిర్ణయం
- శాకమూరులో సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ,కన్వెన్షన్ సెంటర్ కు రూ.596 కోట్లు
- సీఆర్డీఏ 65వ అథారిటీ సమావేశం నిర్ణయాలను వెల్లడించిన మంత్రి నారాయణ......

అమరావతి ఆగస్టు 27, అనంత జనశక్తి ప్రతినిధి

రాజధాని అమరావతిలోని 29 గ్రామాల్లో రూ.1,437 కోట్లతో పెద్ద ఎత్తున మౌళిక వసతుల కల్పన చేపడుతున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఇప్పటికే దీనికోసం రూ.904 కోట్లకు ఆమోదం తెలపగా తాజాగా మరో రూ.533 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు..సచివాలయంలోని మొదటి బ్లాక్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద జరిగిన కేపిటల్ రీజినల్ డెవలప్ మెంట్ అథారిటీ 65 వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు..ఆ వివరాలు ఇలా ఉన్నాయి.201419 మధ్య రాజధాని కోసం భూములిచ్చిన 29 గ్రామాల్లో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసేందుకు అదనంగా రూ.533 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.రాజధానిలో మౌళిక వసతుల మాదిరిగానే గ్రామాల్లో కూడా రోడ్లు, డ్రైన్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజి,తాగు నీటి లైన్లు, లైటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించనున్నట్లు చెప్పారు. అమరావతిలో యూజీడీ వ్యవస్థ ఉన్నందున 29 గ్రామాల్లో కూడా యూజీడీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ కోసం రూ.904 కోట్లు మంజూరు కాగా, తాజాగా మంజూరు చేసిన రూ.533 కోట్లతో కలిపి మొత్తం రూ.1,437 కోట్లతో 29 గ్రామాల్లో 100 శాతం మౌలిక వసతులను పూర్తి చేయనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. శాకమూరులో రూ.596 కోట్లతో సెంట్రల్ పబ్లిక్ లైబ్రరీ,ఆడిటోరియం,హెచ్ఆర్‌కు సంబంధించిన భవనాల నిర్మాణానికి రూ.596 కోట్ల విలువతో పనులు చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు మంత్రి.29 గ్రామాల్లో ఎల్పీఎస్ లేఅవుట్లలోని చిన్న రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, సీఆర్ఆర్ఐ న్యూఢిల్లీ, ఐఐటీ ఖరగ్‌పూర్ సంస్థలతో అధ్యయనం చేయించినట్లు మంత్రి తెలిపారు.అమరావతి ప్రాంతంలోని నేల స్వభావం, భవిష్యత్‌లో పెరగనున్న వాహనాలను దృష్టిలో ఉంచుకుని సీసీ రోడ్లకు బదులుగా బీటీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించామన్నారు..అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ అభివృద్ధికి సంబంధించి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసేందుకు సీఆర్డీఏకు అథారిటీ అనుమతి ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.42 ఎకరాల్లో వివిధ ప్రాజెక్ట్ లను ప్రయివేట్ సంస్థలతో అభివృద్ధికి ఆమోదం.

అమరావతిలో నివాసాలు, షాపులు,కార్యాలయాలు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వం నిర్మించే కార్యాలయాలతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా అభివృద్ధి జరిగేలా 42 ఎకరాల్లో వివిధ ప్రాజెక్ట్ లను చేపడుతున్నామన్నారు..దీనికోసం పిచ్చుకలపాలెంలో 7.9 ఎకరాలు, తుళ్లూరులో 5 ఎకరాలు, మందడంలో 12.38 ఎకరాలు, మరో ప్రాంతంలో 6 ఎకరాలు, కురగల్లులో 6 ఎకరాలు కలిపి మొత్తం 42 ఎకరాలను గుర్తించినట్లు మంత్రి నారాయణ చెప్పారు.అదనపు భూముల కేటాయింపునకు కొత్త విధానం.హోటళ్లు, పాఠశాలలు,ఇతర ప్రాజెక్టులకు ఇప్పటికే భూములు కేటాయించిన ప్రాంతాల్లో పక్కనే కొంతమేర అదనంగా కోరుతున్న వారికోసం కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు.త్రీ స్టార్, ఫోర్ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లు, నేషనల్, ఇంటర్నేషనల్ స్కూల్స్ అదనపు భూమిని కోరితే అమరావతిలోని ప్రస్తుత కనీస ధరపై కనీసం 250 శాతం ధరకు కేటాయించేందుకు అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు. అమరావతిలో ప్రస్తుత కనీస ధర ఎకరాకు రూ.4.1 కోట్లు కాగా, కనీసం ఎకరాకు రూ.10.25 కోట్లకు తగ్గకుండా అదనపు భూమిని కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**ల్యాండ్ పూలింగ్ రైతు కుటుంబాలకు రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ**

ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లోని రైతులకు ఒక్కో కుటుంబానికి గరిష్టంగా రూ.1.5 లక్షల వరకూ రుణమాఫీ చేసేందుకు అథారిటీ ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ వివరించారు..2026 జనవరి 1 వ తేదీకి ముందు తీసుకున్న రుణాలకు వర్తించేలా అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు.

**మంగళగిరికి అమరావతి నుంచి తాగునీరు**

అమరావతి క్యాపిటల్ సిటీ నుంచి మంగళగిరి కార్పొరేషన్‌కు తాగునీరు అందించేందుకు అథారిటీ ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ప్రస్తుతం మంగళగిరికి 30 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండగా, రాబోయే 30 సంవత్సరాల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో 80 ఎంఎల్‌డీ వరకు నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకునేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు.అమరావతిలో నిర్మిస్తున్న స్టోరేజీల నుంచి మంగళగిరికి నీటిని అందించేందుకు, కిలోలీటర్‌కు రూ.10 చొప్పున ధర నిర్ణయించి సరఫరా చేయడానికి అథారిటీ అంగీకరించిందన్నారు.

**ఐఓసీఎల్‌తో గ్రీన్ ఎనర్జీ కోసం ఎంఓయూ**

అమరావతిలో గ్రీన్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు సీఆర్డీఏకు అథారిటీ అనుమతి ఇచ్చిందన్నారు మంత్రి.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అమరావతిలో డీమ్డ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి 8.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు..తాడికొండ,కంతేరులో ల్యాండ్ పూలింగ్.

తాడికొండ,కంతేరు ప్రాంతాల మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే ట్రాక్ వెళ్తుండటంతో వాటి పరిధిలోని క్యాపిటల్ సిటీ వరకు ఉన్న భూములను ల్యాండ్ పూలింగ్‌లోకి తీసుకునేందుకు సీఆర్డీఏకు అథారిటీ అనుమతి ఇచ్చిందని మంత్రి నారాయణ తెలిపారు.

# శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఐదుగురికి కారుణ్య నియామకాలు

- నూతన ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేత

అనంతపురం, ఆగస్టు 27:అనంత జనశక్తి న్యూస్



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మానవతా దృక్పథంతో కారుణ్య నియామకాల కింద ఐదుగురికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు కల్పించారు. నూతనంగా నియమితులైన వారికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా నూతన ఉద్యోగులను అభినందించిన ఉపకులపతి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఉపాధి కల్పించడం పట్ల బోధనేతర ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది.కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్లుగా జి. రంగసాయి దీపక్, ఎన్. బాబా షరీఫ్, బి. కృష్ణ చైతన్య, ఎన్. ఆదిత్య చౌదరి, కె. సునీల్ కుమార్ నియమితులయ్యారు. నూతన ఉద్యోగులకు నియామకాలు కల్పించేందుకు సహకరించిన ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్, రెక్టర్ ఆచార్య బి. అనిత, రిజిస్ట్రార్ డా. ఈ. రమేష్ బాబుకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ బోధనేతర ఉద్యోగుల సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన ఐదుగురికి సంఘం నాయకులు, ఉద్యోగులు హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# 'ఖేలో ఇండియా సంవాద్' కార్యక్రమంలో ఎస్కేయూ ఉపకులపతి జ్యోతి కుమార్

- క్రీడలతో యువతలో నాయకత్వం, క్రమశిక్షణ పెంపొందుతాయి

అనంతపురం, ఆగస్టు 27:అనంత జనశక్తి న్యూస్



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా సంవాద్-ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్' కార్యక్రమాన్ని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగాన్ని విద్యార్థులు, యువత ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం స్థానిక క్రీడాకారులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం, 2036 ఒలింపిక్స్‌కు క్రీడాకారులను తీర్చిదిద్దడం వంటి అంశాలపై చర్చించారు.క్రీడల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనలో యువత పాత్ర, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్-ఆర్థిక పరిజ్ఞానం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం, మేరా యువ భారత్ ద్వారా యువతకు అందుతున్న అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు.కార్యక్రమంలో అండర్-14 విభాగంలో టేబుల్ టెన్నిస్ జాతీయ స్థాయి క్రీడాకారిణి ఎం. శ్రీ షాన్వినిని ఉపకులపతి ఘనంగా సత్కరించారు. ఆమె క్రీడా ప్రతిభను అభినందిస్తూ జ్యోతి కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. షాన్వి కోచ్ శ్రీ ధనుంజయతో పాటు ఆమె తల్లిదండ్రులను కూడా సత్కరించారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సదాశివరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, పీఆర్ఓ డాక్టర్ బి. సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు శారదాదేవి, ఉషారాణి, విజయ్ కుమార్, నరసింహులు, విమల, అధ్యాపకులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు. యువత క్రీడలను కెరీర్‌గా స్వీకరించడంతో పాటు క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలతో దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ఆకాంక్షించారు.

# విద్యార్థులకు నేరాలపై పోలీసుల అవగాహన



- ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై విస్తృత అవగాహన

అనంతపురం, ఆగస్టు 27:అనంత జనశక్తి న్యూస్

జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా వ్యాప్తంగా పోలీసులు గురువారం పలు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ నేటి యువతే దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థినులు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో 100, 112 సేవలను వినియోగించుకునే విధానాన్ని వివరించారు. మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న శక్తి యాప్ వినియోగంపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు.సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, OTPలు, బ్యాంకింగ్ సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. సురక్షితమైన, నేరరహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని అనంతపురం జిల్లా పోలీసులు పిలుపునిచ్చారు.

## మాతృ, శిశు మరణాల నివారణకు

# సమగ్ర చర్యలు చేపట్టాలి

- బరువు తక్కువ ఉన్న గర్భిణులకు ఐసిడిఎస్ ద్వారా ప్రత్యేక పోషకాహారం అందించాలి
- టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే ప్రమాదాలు, బాల్య వివాహాల నివారణ మరియు పెంపకంలో ప్రాముఖ్యతపై పటిష్ట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి,ఆగస్టు, 27:అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లాలో మాతృ, శిశు మరణాలను అరికట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ మరియు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాల్ నందు ఏప్రిల్ 2026 నుండి జూలై 2026 వ్యవధికి సంబంధించిన మాతృ మరణాల సర్వేలు మరియు సమీక్ష (MDSR) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...** రక్తహీనత ఉన్న గర్భిణులందరికీ క్రమం తప్పకుండా FCM (Ferric Carboxy Maltose) ఇంజెక్షన్లు అందించాలని, హైరిస్క్ గర్భిణులకు తప్పనిసరిగా TIFFA స్కాన్లు మరియు అవసరమైన కేసుల్లో 2D ECHO పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముందస్తుగా గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు నిపుణులైన కార్డియాలజిస్టులతో MoUలు కుదుర్చుకోవాలని అధికారులకు సూచించారు. బరువు తక్కువగా ఉన్న గర్భిణులకు ఐసిడిఎస్ ద్వారా ప్రత్యేక పోషకాహారం మరియు డబుల్ రేషన్ అందించాలన్నారు.ప్రతి గర్భిణికి సంబంధించిన గత గర్భధారణ వివరాలు, కుటుంబ ఆరోగ్య చరిత్ర మరియు వైద్య నివేదికలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సరిగ్గా నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఓపిడి పరిశీలన సమయంలో ప్రతి గర్భిణితో వైద్యులు కనీసం 10 నిమిషాలు కేటాయించి తగిన సలహాలు అందించాలన్నారు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే ప్రమాదాలు మరియు పెంపకంలో పసిపాప ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.జిల్లాలో సంభవించిన మాతృ మరణాల (S. సజియా,వాణిశ్రీ, KS మెహతాజ్, M. మౌనిక, ఉప్పర రమ్యశ్రీ) కేసుల నివేదికలను నిపుణుల కమిటీ సమగ్రంగా విశ్లేషించి ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిఎమ్ఎస్ఎంఏ పథకం కింద ప్రతి నెలా నిర్వహించే వైద్య శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఐసీడీఎస్, డిడబ్ల్యూసిఆర్ఎ, మహిళా పోలీస్ మరియు మెప్మా సహాయంతో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజా బెగం, డిసిహెచ్ఎస్ మధుసూదన్, డిఐఓ చెన్నారెడ్డి,సంబంధిత గైనకాలజిస్టులు, పీడియాట్రీషియన్లు,డెమో సుబ్రమణ్యం మరియు ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

## మసీదు నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం అందజేసిన

# ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తలుపుల ఆగస్టు 27,అనంత జనశక్తి న్యూస్

తలుపుల మండలం గుండువారిపల్లి గ్రామంలో మైనారిటీ సోదరులు నిర్మిస్తున్న మసీదు నిర్మాణానికి కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ రూ.1 లక్ష విరాళం అందజేశారు.ఎమ్మెల్యే తరపున మాజీ ఎంపీపీ పూల విజయారెడ్డి అన్న చేతుల మీదుగా ఈ విరాళాన్ని మైనారిటీ సోదరులకు అందజేశారు.ఈ సందర్భంగా మైనారిటీ సోదరులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మత సామరస్యాన్ని, సోదరభావాన్ని కాపాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమానంగా అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే సేవలను అభినందించారు. మైనారిటీల సమస్యలను తన సమస్యలుగా భావించి, అవసరమైన సమయంలో ముందుకు వచ్చి సహాయం అందిస్తున్న ఎమ్మెల్యేకి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.కదిరి నియోజకవర్గంలో ప్రతి వర్గం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, రాబోయే రోజుల్లో కూడా ఆయన నాయకత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తామని మైనారిటీ సోదరులు తెలిపారు.





## చంద్రబాబును మర్యాదపూర్వకంగా

# కలిసిన విష్ణువర్ధన్ రెడ్డి

అమరావతి, ఆగస్టు 27: అనంత జనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని బీజేపీ జాతీయ సెల్ విభాగాల సహ సమన్వయకర్త ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి గురువారం సాయంత్రం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా జాతీయ స్థాయిలో బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్ రెడ్డికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మరింత సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు ఆయన మీడియాకు వెల్లడించారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో తనకు బాధ్యతలు అప్పగించినందుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విష్ణువర్ధన్ రెడ్డి మీడియా ద్వారా ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మరింతగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

## కుటుంబ వివాదాల పరిష్కారంలో

# ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్




కుటుంబ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించి, దంపతులు తిరిగి సంతోషంగా కలిసి జీవించేలా చేస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల సేవలు అభినందనీయమని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కదిరి పట్టణం మదనపల్లి రోడ్డులోని పీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ పొంది కుటుంబ వివాదాలను పరిష్కరించుకుని తిరిగి కాపురం కొనసాగిస్తున్న దంపతులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెద్దగా ఆలోచించని విధంగా సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కుటుంబ వ్యవస్థను పరిరక్షించే దిశగా ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.చిన్నచిన్న సమస్యలు పెద్ద వివాదాలుగా మారకుండా భార్యాభర్తలు పరస్పర అవగాహన, సహనం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న కౌన్సెలింగ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు.కౌన్సెలింగ్ ద్వారా కుటుంబాలను తిరిగి ఒక్కటి చేయడం, దంపతుల మధ్య అపోహలను తొలగించడం ద్వారా కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ల సేవలను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ , అడిషనల్ ఎస్పీ శ్రీమతి అంకిత సురానా , డీఎస్పీ శివనారాయణ స్వామి , సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు పాల్గొన్నారు.మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాడుగ తోపుడు బండితో జీవనం..

# సొంత బండి అందించిన మంత్రి సవిత

పెనుకొండ ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్

భర్తను కోల్పోయి, బాడుగ తోపుడు బండిపై బజ్జీలు విక్రయిస్తూ కుమారుడు, కుమార్తెను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్న లీలావతికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ అండగా నిలిచారు. బుధవారంవారం గోరంట్ల పట్టణంలో పర్యటించిన మంత్రి సవితమ్మను బస్టాండ్ సమీపంలో బాడుగ తోపుడు బండిపై బజ్జీలు విక్రయిస్తున్న లీలావతి కలిశారు. తన భర్త చనిపోయారని, బాడుగకు తోపుడు బండి తీసుకుని బజ్జీలు అమ్ముకుంటూ వచ్చే ఆదాయంతో కుమారుడు, కుమార్తెను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నానని మంత్రికి వివరించారు. బాడుగ బండితో ఇబ్బందులు పడుతున్నానని, తనకు సొంత తోపుడు బండి ఏర్పాటు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.లీలావతి పరిస్థితిని అర్థం చేసుకున్న మంత్రి సవితమ్మ వెంటనే స్పందిస్తూ "రేపు పెనుకొండ క్యాంపు కార్యాలయానికి వచ్చి కలవండి.. తప్పకుండా మీకు సొంత తోపుడు బండి ఏర్పాటు చేస్తాను"అని హామీ ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం గురువారం లీలావతిని పెనుకొండ క్యాంపు కార్యాలయానికి పిలిపించి, ఆమె జీవనోపాధికి ఉపయోగపడేలా సొంత తోపుడు బండిని మంత్రి సవితమ్మ అందజేశారు.సొంత తోపుడు బండి అందడంతో ఇకపై బాడుగ భారం లేకుండా వచ్చిన ఆదాయంతో తన




పిల్లలను మరింత బాగా చదివించుకుంటానని లీలావతి తెలిపారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే స్పందించి, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి సవితమ్మకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.పేదలు, మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేలా వారికి అండగా నిలవడమే తమ లక్ష్యమని మంత్రి సవితమ్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో గోరంట్ల పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పై అవగాహన కలిగి

# ఉండాలి సి. ఐ శ్రీనివాసులు



అమడగూరు ఆగస్టు 27,( అనంత జనశక్తి న్యూస్)

మండల పరిధిలోని, గొల్లపల్లి, లో గురువారం, నల్లమడ సిఐ, శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామస్తులకు సైబర్ నేరాలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా నల్లమాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో టెక్నాలజీ మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మనం చేసే చిన్న పొరపాటు సైతం సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పించి, మన కష్టార్జితాన్ని కోల్పోయే పరిస్థితికి దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రత్యేకంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు, ఈకామర్స్ కొనుగోళ్లు, సోషల్ మీడియా వినియోగం విషయంలో అప్రమత్తత చాలా అవసరమన్నారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.అంతేకాకుండా గ్రామాలలో జూదాలు, గొడవలు చేసుకోకుండా ఉండాలని సూచించారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే యువకులు మద్యానికి బానిసలు అయి కుటుంబాలను చిన్నభిన్నం చేసుకోకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## జీసీసీ కాంట్రాక్టు ఉద్యోగులకు

# గుర్తింపు కార్డులు ఇవ్వాలి



- 20 ఏళ్లుగా సేవలందిస్తున్నా గుర్తింపు శున్యం.
- జిసిసి మేనజర్ కలిసి వినతి పత్రం ఇచ్చిన యూనియన్ నాయకులు.

అనంతగిరి,ఆగస్టు 27: అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండలంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ)లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సేల్స్‌మెన్‌లకు సంస్థ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సేల్స్‌మెన్‌ల మండల యూనియన్ అధ్యక్షుడు భీమవరపు ముత్యాలు కోరారు. ఈ మేరకు గురువారం కాశీపట్నం జీసీసీ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ బుక్క వెంకటేశ్వరరావుకు సేల్స్‌మెన్‌లతో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా భీమవరపు ముత్యాలు మాట్లాడుతూ.. తాము గత 20 సంవత్సరాలుగా జీసీసీలో సేల్స్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తూ సంస్థకు సేవలందిస్తున్నామని తెలిపారు. ఇంతకాలంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తమకు సంస్థ తరపున అధికారిక గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం తమకు సీఎఫ్ఎంఎస్ ఐడీ ద్వారా, నిధి పోర్టల్‌లో ప్రతి నెలా జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. సంస్థలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, ఎంప్లాయీ ఐడీ మంజూరు చేసి సంస్థ గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. గుర్తింపు కార్డులు అందించడం ద్వారా విధి నిర్వహణలో తమకు అధికారిక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను సానుకూలంగా పరిశీలించి, కాంట్రాక్టు సేల్స్‌మెన్‌లకు ఉద్యోగ భద్రతతో పాటు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని భీమవరపు ముత్యాలు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సేల్స్‌మెన్‌లు కిల్లో అప్పలస్వామి, రూంజల శోభన్ బాబు, కలయి అప్పలస్వామి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై

# తక్షణం స్పందించాలి

- పెండింగ్‌లో ఉన్న రైతు వ్యవసాయ సర్వీసులను సకాలంలో అందించాలి
- రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి

పుట్టపర్తి, ఆగస్టు 27: అనంత జనశక్తి న్యూస్

రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సంబంధిత సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులను సకాలంలో అందించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి సూచించారు.పుట్టపర్తిలోనీ ట్రాన్స్కో ఎస్ ఈ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన నియోజకవర్గ విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు ఎస్ ఈ మోసెస్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రాన్స్‌కో ఎస్ఈ మోసెస్ తో పాటు నియోజకవర్గ పరిధిలోని డీఈలు, ఏఈఈలు హాజరయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులు, కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.రైతులు వ్యవసాయ పనుల్లో ఇబ్బందులు పడకుండా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి వచ్చే విద్యుత్ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.నియోజవర్గం లో పెండింగ్‌లో ఉన్న సుమారు 1371 వ్యవసాయ సర్వీసులను పరిశీలించి, అర్హత ఉన్న రైతులకు సకాలంలో సేవలు అందించాలని, అవసరమైన చోట్ల సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ మోసెస్ , ఈఈ శివరాముడు , డీ ఈ కృష్ణదేవరాయలు, ఓబులేసు ,రామకృష్ణ ,రమణారెడ్డి , ఏఈఈ సాయినాథ్ గౌడ్ ,నారాయణస్వామి నాయక్ ,వెంకటేష్ నాయక్ ,చంద్ర నాయక్, గౌరీ శంకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి

**– జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ**

**అనంతపురం, ఆగస్టు 27 :అనంత జనశక్తి న్యూస్**

జెడ్పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో గురువారం జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించగా, సమావేశంలో హిందూపురం ఎంపీ బికె. పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధు రారెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్ఓ కొండయ్య, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు, ఆయా శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ మాట్లాడుతూ ఐదేళ్ల జడ్పీ పాలనా కాలం ముగింపుపై ధన్యవాదాలు తెలుపుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి, జిల్లా సమగ్రాభివృద్ధికి శ్రమించామన్నారు. ప్రజా ప్రతినిధులుగా స్వీకరించిన బాధ్యతను ఐదేళ్ల పాటు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజల సమస్యలను నిరంతరం సభ దృష్టికి తీసుకువస్తూ, వాటి పరిష్కారం కోసం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయడం జరిగిందన్నారు. కరోనా వంటి మహమ్మారి విపత్తులు, తుఫానులు, వరదలు వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగామన్నారు. సభలో నిరంతరం సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, పశుసంవర్ధక రంగం మరియు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కీలక సమస్యలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి కొరత, రైతుల సమస్యలు, ఎంపీడీవోల కొరత మరియు గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను సభ్యులందరూ సభ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేశారన్నారు. జెడ్పి పాలకమండలి ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా, ఈ ప్రయాణంలో పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి మాట్లాడుతూ ఆత్మకూరు అనంతపురం రూరల్ పరిధిలో తాగునీటి పైప్లైన్ కోసం 90 కోట్లు మంజూరయ్యాయని, ప్రభుత్వం నిధులు ఇచ్చినా పనులు ఎందుకు పూర్తి చేయలేదని, ఎల్.నినో పరిస్థితుల వలన త్రాగునీటి సమస్య జఠిలంగా ఉందని, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పనులు పూర్తి చేయడం లేదని, వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మడకశిర ప్రాంతం కరువు ప్రాంతం అని, మడకశిర, అమరాపురంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సంబంధిత ఎస్ఈలు డిఈలతో సమావేశం పెట్టుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. తమ కూటమి ప్రభుత్వానికి రైతులపై అవ్యాజమైన ప్రేమ ఉందని, 3800 కోట్లు ఖర్చు చేసి హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువను వెడల్పు చేసి నీరు తీసుకువచ్చామన్నారు. మల్యాల నుంచి కుప్పం వరకు త్రాగు, సాగునీరు అందిస్తున్నామన్నారు. ఎల్.నినో వల్ల తుంగభద్ర డ్యామ్ కు పూర్తిగా నీరు రాలేదని, ప్రభుత్వం వచ్చే నీటిని త్రాగునీటికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. త్రాగునీటికి నిధుల కొరత రాకుండా చూసుకుంటామన్నారు. జిల్లాలో ఇరిగేషన్ లేని చోట పశుగ్రాసం కొరత వస్తుందని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి పశుగ్రాసం కొరత రాకుండా చూడాలన్నారు. అనంతపురం జిల్లా నుంచి అధికారుల టీం కర్ణాటకలోని చెల్లికెర తాలూకాలో వెళ్లి విబి జిరాంజీ పథకం కింద పనులు పరిశీలించాలని, అక్కడ ఆ పనులను రైతులతో అనుసంధానం చేస్తే ఇక్కడ కూడా అలా చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పావగడ మధుగిరి వరకు పనులు పూర్తిచేసి కళ్యాణదుర్గం నుంచి తుమకూరు వరకు తొందరలో రైలు తీసుకెళ్లేలా చూస్తామన్నారు. పెనుగొండ పరిధిలోని సాకర్లపల్లి వద్ద 29 కోట్ల రూపాయలతో రైల్వే బ్రిడ్జి మంజూరు చేశామని, పనులు మొదలయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గొప్ప అవకాశాన్ని తనకు కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు. బడుగు బలహీన వర్గాల కుటుంబానికి చెందిన వడ్డెర ఆడబిడ్డనైన తనకు శాసన మండలికి వెళ్లేందుకు అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.తనకు సహాయ సహకారాలు అందించిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి, ఎంపీ పార్థసారథికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లుగా అనంతపురం అర్బన్ కు సంబంధించి త్రాగునీటి పైప్లైన్ పనులు చాలా పెండింగ్ ఉన్నాయని, రూరల్ లో త్రాగునీటి సమస్య ఉందని, రెండేళ్ల నుంచి కాంట్రాక్టర్ సమస్య ఉందని, పనులను పూర్తి చేయాలన్నారు. రెండేళ్లుగా పనులు చేయకున్నా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోలేదని.. ఆ కాంట్రాక్టర్లపై మీకు ఎందుకు అంత ప్రేమ అని అన్నారు. నాలుగు పంచాయతీలలో ఉన్న తాగు నీటి సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. గత రెండేళ్లుగా పనులు చేయకున్నా.. ఎందుకు కాంట్రాక్టర్లను తొలగించలేదని, ఈ విషయంపై ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రెండేళ్లుగా ఇలాగే ఉంటే వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కోవాలన్నారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆ కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారికి పనులు అప్పజెప్పి పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ ఎల్.నినో పరిస్థితులతో సాగునీరు ఇవ్వలేకపోతున్నామన్నారు. గతేడాది హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా




52 టీఎంసీలకు పైగా నీరు తీసుకువచ్చామని, ఈ ఏడాది వర్షాలు రావడంలేదని, అంత నీరు రావడం లేదని, త్రాగునీటి కోసం చెరువులను నింపుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీనీవాకు ప్రత్యేక విధులు కేటాయించారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ వచ్చిన తర్వాతే విద్యా శాఖలో అనేక మార్పులు వచ్చాయని... ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరుతున్నారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తున్నారన్నారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ఖచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, త్వరితగతిన నిధులు విడుదల చేయిస్తామన్నారు.ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు మరియు సాగునీటి నిర్వహణకు సంబంధించి యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల తక్షణ పరిష్కారం కోసం 9550480972 కంట్రోల్ రూమ్ నంబర్ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో చిన్న చిన్న బోర్లు, పైప్లైన్ మరమ్మతులను పంచాయతీ నిధులతోనే తక్షణమే పూర్తిచేస్తారని, మరింత నిధులు అవసరమైతే డెప్యూటీ ఎంపిడిఓ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ పర్యవేక్షణలో మండల పరిషత్ నిధులను వినియోగిస్తారన్నారు. మరమ్మతుల కోసం డిఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) నుండి 4 కోట్లు, అత్యవసర నిధుల కింద 48 లక్షలు, మరియు జిల్లా పరిషత్ నిధుల నుండి 60 లక్షల రూపాయలను కేటాయించామన్నారు. ఫిర్యాదులు వచ్చిన 24 గంటల్లోనే సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డబ్ల్యుఎస్, సత్యసాయి తాగునీటి పథకాల సిబ్బందికి సంబంధించి గత 23 నెలల పెండింగ్ వేతనాలను ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఆమోదంతో పూర్తిగా క్లియర్ చేయడం జరిగిందన్నారు. ఎల్.నినో నేపథ్యంలో జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 40 నుండి 50 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. హెచ్.ఎల్.సి నుంచి నీటి కేటాయింపు గతంలో 25 టిఎంసిల వరకు ఉండగా, ఈ సంవత్సరం 'ప్రోరాటా' పద్ధతిన కేవలం 16 టిఎంసిలు మాత్రమే కేటాయించారని, దీనివల్ల PABR కి చేరుకునే నీరు 9 నుండి 10 టిఎంసిలకు మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉందన్నారు. త్రాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తూ కేటాయించిన నీటిలో ఎక్కువ నీటిని అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని సుమారు 800 గ్రామాలకు తాగునీటి అవసరాల (సత్యసాయి, RWS, GBC కెనాల్ ద్వారా గుంతకల్లు మున్సిపాలిటీ) కొరకు భద్రపరచాల్సి ఉందన్నారు. HNSS నీటి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర స్థాయి నుండి 4 టిఎంసిల నీరు కేటాయించినప్పటికీ, KRMB (కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు) మీటింగ్లో తుది నిర్ణయం రావాల్సి ఉందని, నిర్ణయం వెలువడిన అనంతరం అదనపు నీటి లభ్యతను బట్టి సాగునీటిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాబోయే కాలంలో ఎల్నినో ప్రభావం మరో 1 నుండి ఒకటిన్నర సంవత్సరాల వరకు ఉండే అవకాశం ఉందని IMD (వాతావరణ శాఖ) హెచ్చరించిందని, ఎక్కువ నీటి వినియోగం అవసరమయ్యే వరి, మిర్చి వంటి పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. రైతులు ఆరుతడి (ID) పంటలు మరియు వర్షాధార పంటలను మాత్రమే సాగు చేయాలని, PMDS ద్వారా పెల్లటైజేషన్ పద్ధతులను పాటించాలని కోరారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కనేకల్లు బాలుర గురుకుల పాఠశాలకు సంబంధించి వారం రోజుల్లో పు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ సమస్యలను తెలియజేశారు. నార్పల జడ్పిటిసి నాగరత్నమ్మ మాట్లాడుతూ కొత్త పెన్షన్లు ఇప్పించాలని, తల్లికి వందనం కింద రెండవ విడత అందించాలని, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలని, కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుక్కరాయసముద్రం జడ్పిటిసి మాట్లాడుతూ మండలంలోని సిద్ధరాంపురంలో తాగునీటి సమస్య ఉందని, నాలుగైదు రోజులకు ఒకసారి నీరు వస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతపురం రూరల్ జెడ్పిటిసి మాట్లాడుతూ పీఏబీఆర్ ఆత్మకూరు నుంచి అనంతపురం రూరల్ కు 90 కోట్లతో పైప్ లైన్ తీసుకొచ్చారని, ఇంతవరకు నీరు రావడంలేదని, పనులు పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. వజ్రకరూరు జడ్పిటిసి మాట్లాడుతూ వజ్రకరూరులోని పలు వార్డులలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, కొనకొండ్ల, గుడిసెలపల్లిలో నీటి సమస్య చాలా ఉందని, అక్కడ బోర్లు వేస్తే ఉప్పునీరు పడుతుందని, నీరు ట్యాంకర్లతో ఇంతకుముందు సరఫరా చేసామని, అందుకు బిల్లులు ఇవ్వలేదన్నారు. మడకశిర జడ్పిటిసి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఐదు మండలాలలో శ్రీరామరెడ్డి పథకం కింద త్రాగునీరు రావడంలేదని, అక్కడ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఎవరు అందుబాటులో లేరన్నారు. పరిగి జెడ్పిటిసి మాట్లాడుతూ తమ మండలంలో పిఎబిఆర్ నీరు సరఫరా నిలిచిపోయిందని, అక్కడ విద్యుత్ అధికారులు పైప్లైన్ తీసేసారని, రిపేరు చేయించాలన్నారు. రొళ్ల జడ్పిటిసి మాట్లాడుతూ తమ మండలంలోని పలు పంచాయతీలలో తాగునీరు రావడంలేదని, సమస్య పరిష్కరించాలన్నారు. కదిరి జడ్పిటిసి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో పార్నపల్లి నుంచి సత్యసాయి నీరు రావడంలేదని, గాండ్లపెంట, ఎన్పికుంటలో కరువు పరిస్థితి ఉందని, పైప్ లైన్ లలో నీరు వచ్చేలా చూడాలన్నారు. కనగానపల్లి జడ్పిటిసి మాట్లాడుతూ సత్యసాయి వాటర్ స్కీం కింద నీరు ఎప్పుడు వస్తాయో తెలియదని, మండలానికి నీరు ఇవ్వాలన్నారు. కనేకల్ జడ్పిటిసి మాట్లాడుతూ కనేకల్ చెరువుకు హెచ్.ఎల్.సి నీరు వచ్చిందని, కిందకు వదలడం లేదని, రైతులు నారు పోసుకున్నారని, అది ఎండిపోతుందని, పంటలకు నీరిచ్చేలా చూడాలన్నారు. ఎల్లనూరు జడ్పిటిసి మాట్లాడుతూ గండికోట నుంచి మండలంలో 4 చెరువులను నింపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేపాక్షి జెడ్పిటిసి మాట్లాడుతూ ఎల్.నినో ప్రభావంతో పశుగ్రాసనం కొరత వచ్చిందని, ఉచితంగా పశుగ్రాసం, అదనంగా దాణా సబ్సిడీతో ఇవ్వాలన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మూగజీవాలు చనిపోయినప్పుడు వాటికి ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని, ఉపాధి పనులను కొండలు, గుట్టలలో చేస్తున్నారని, రైతులకు అనుసంధానం చేయాలన్నారు. కదిరి జడ్పిటిసి మాట్లాడుతూ సత్యసాయి నీటిని మెట్టుకుపల్లి గ్రామానికి ఆపేశారని, వెంటనే ఇవ్వాలని కోరారు. కళ్యాణదుర్గం జడ్పిటిసి మాట్లాడుతూ సెట్టూరులో గోడ కూలి ఎస్సి విద్యార్థి చనిపోయారని, మరొకరు గాయపడ్డారని, చనిపోయిన విద్యార్థికి ఐదు లక్షలు ఇచ్చారని, వారి కుటుంబానికి ఒక ఉద్యోగం, 50 లక్షలు ఇవ్వాలని కోరారు. సెట్టూరు ఎస్సీ హాస్టల్లో 16 మరుగుదొడ్లు నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్నాయని, వాటికి ప్రారంభించాలన్నారు. పెనుగొండ, సాకర్లపల్లి క్రాసింగ్ వద్ద రైల్వే బ్రిడ్జి వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించాలని కోరారు.ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు ఆయా శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రగతి ప్రణాళిక

**50 శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ఏపీ గ్రీన్**
**ఉప ముఖ్యమంత్రి పర్యవేక్షణలో గ్రీన్ కవర్ కార్యక్రమాల సమన్వయం**
**రాష్ట్ర స్థాయి పాలక మండలి ఛైర్మన్ గా ఉప ముఖ్యమంత్రివర్యులు**
**ఏపీ గ్రీన్ ఛైర్మన్ అధ్యక్షతన కార్యనిర్వాహక కమిటీ విధులు**
**జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమాల సమన్వయం**
**పచ్చదనం పెంపు, పర్యావరణ పునరుద్ధరణలో ప్రజా భాగస్వామ్య కార్యచరణ**

- **ఎమ్మెల్సీ నాగబాబు నాయకత్వంలో బాధ్యతాయుతమైన వ్యవస్థల నిర్మాణం**
- **మండల స్థాయి నుంచి మిషన్ మోడ్ కార్యాచరణకు ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు**
- **ప్రకృతి ఆధారిత జీవనోపాధి, గ్రామీణ ఉపాధి అవకాశాల సృష్టి**

**అమరావతి ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్**

ప్రకృతి ఒడిలో రాష్ట్ర ప్రగతి ప్రయాణం సాగాలి. అది పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి. ఉన్న అడవులను కాపాడుకుంటూ, కొత్త అడవులను సృష్టించాలి. ప్రతి గ్రామాన్ని పచ్చదనపు ఛత్రం కిందకు చేర్చాలి. చెట్లను కాపాడుకుంటూ, ఆ చెట్ల నుంచి వచ్చే ఫలసాయం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించుకుంటూ, గ్రామాల్లో ప్రకృతి ఆధారిత జీవనోపాధి లక్ష్యాలు సాధించాలన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆలోచనల నుంచి ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్రిచ్మెంట్ (APGREEN) రూపుదిద్దుకొంది. భవిష్యత్ తరాల కోసం పచ్చని, స్వచ్ఛమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు చేపడుతున్న 50 శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కోసం APGREEN ఏర్పాటుకు అడుగులుపడ్డాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విధులు నిర్వహిస్తూ, అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, పరిశ్రమలు, జలవనరులు, పట్టణ స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సం ను వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రివర్యులు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను నిరంతరాయంగా అమలు పరుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మ్ ఫారెస్ట్రీ, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్లు, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్లు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో మొక్కల పెంపకాన్ని APGREEN సంస్థ ద్వారా చేపడతారు. ముఖ్యంగా పచ్చదనం క్షీణించిన భూములు, మైనింగ్ ప్రభావిత ప్రాంతాలు, బంజరు భూములు, ఇతర ఎకో సెన్సిటివ్ జోన్ల పునరుద్ధరణకు ఈ కార్యచరణలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ మొత్తం కార్యక్రమాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతోపాటు రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యా సంస్థలను అనుసంధానిస్తూ, నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా నర్సరీ నెట్వర్క్ను అభివృద్ధి చేస్తారు.గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలన్న భేదం లేకుండా 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, చెట్ల ఆధారిత జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సృష్టించడం, వాతావరణ మార్పులకు అనుగుణమైన జాతుల ఎంపిక, పెంపకం, తద్వారా శాస్త్రీయ పద్ధతులతో పర్యావరణ పునరుద్ధరణ చేపట్టడం అనే ప్రధాన లక్ష్యాలను APGREEN అత్యంత నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్తుంది. GIS, జియోట్యాగింగ్, డిజిటల్ మానిటరింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొక్కల పెంపకం, వాటి మనుగడకు భద్రత కల్పించడం, గ్రీన్ కవర్ పెరుగుదల కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తుంది.
APGREEN కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, నాబార్డ్, సీఎస్ఆర్ నిధులు, కార్బన్ ఫైనాన్స్, కార్బన్ క్రెడిట్లు, గ్రీన్ బాండ్లు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎకోటూరిజం వంటి వివిధ వనరుల ద్వారా నిధులను సమీకరించనున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో APGREEN ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఆధ్వర్యంలో నిధుల వినియోగం, పచ్చదనం పెంపొందించే అంశంలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, మిషన్ మోడ్లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. APGREEN సంస్థ గ్రీన్ కవర్ కార్యక్రమాల రాష్ట్ర స్థాయి సమన్వయం, పర్యవేక్షణ చేపడుతుంది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్మెంట్ ఏజెన్సీలు (DGDAs), మండల స్థాయిలో MGICs ద్వారా కార్యక్రమాలు అమలు చేస్తారు. ప్రతి అడుగులో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లనున్నారు.50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో భాగంగా 2030 నాటికి 33 శాతం పచ్చదనం పెంపొందించాలని నిర్ణయించారు. అందుకోసం సమగ్ర ప్రణాళికను శ్రీ పవన్ కళ్యాణ్ రూపొందించారు. వచ్చే నాలుగేళ్లలో ఏడాదికి ఎన్ని హెక్టార్ల పరిధిలో పచ్చదనం పెంపొందించాలన్న దానిపై కార్యాచరణ సిద్ధం చేశారు. ఆరు నెలలు, మూడు నెలలు, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్కు అనుగుణంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో చేపట్టిన ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని APGREEN పరిపాలనా కార్యకలాపాలు మొదలవుతున్న వేళ పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

* మూడంచెల వ్యవస్థతో ఏపీ గ్రీన్ కార్యకలాపాలు

**ఏపీ గ్రీన్ మూడంచెల వ్యవస్థ ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తుంది. రాష్ట్ర స్థాయి పాలక మండలికి రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ చైర్మన్గా, ఏపీ గ్రీన్ ఛైర్పర్సన్ వైస్ చైర్మన్గా బాధ్యతలు నిర్వహిస్తారు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ, జలవనరులు, రోడ్లు-భవనాల శాఖల ప్రధాన కార్యదర్శులు, పీసీసీఎఫ్ డైరెక్టర్లుగా ఉంటారు. వీరితోపాటు ఏపీ గ్రీన్ సీఈఓ, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ రంగానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యా సంస్థ ప్రతినిధి, ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక అటవీకరణ రంగంలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజానికి చెందిన ప్రతినిధులతో కలిపి మొత్తం 24 మంది పాలక మండలిలో భాగస్వాములుగా ఉంటారు.**
**రాష్ట్ర స్థాయి పాలక మండలి ఏటా రెండుసార్లు సమావేశమై విధానాల రూపకల్పన, ఏపీ గ్రీన్ కార్యకలాపాల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రెండో అంచెలో ఎగ్జిక్యూటివ్ కమిటీ కేబినెట్ హోదా కలిగిన ఏపీ గ్రీన్ ఛైర్పర్సన్ అధ్యక్షతన విధులు నిర్వహిస్తుంది. కమిషనర్ గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశమవుతుంది. జిల్లా స్థాయి గ్రీన్ డెవలప్మెంట్ అథారిటీ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పని చేస్తుంది. జిల్లా స్థాయి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, వ్యవసాయం, ఉద్యానవనం, పరిశ్రమలు, ఆర్ అండ్ బీ, దేవాదాయ, జలవనరులు, విద్యాశాఖల అధికారులు సభ్యులుగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యతలు చేపడతారు.**

# మీరాలం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

సందర్శకులను ఆకర్షించేలా పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దడంతోపాటు ప్రజలకు మెరుగైన పబ్లిక్ స్పేస్లు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పూర్తయితే ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వంతెనతోపాటు చెరువు పరిసరాల అభివృద్ధి పూర్తయితే నగరంలోని మరో కీలక వినోద, పర్యాటక కేంద్రంగా మీరాలం రూపుదిద్దుకునే అవకాశముందని అంటున్నారు. సీఎం ఆకస్మిక తనిఖీతో అధికారులు అప్రమత్తమయ్యారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, గడువులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై మరింత దృష్టి సారించారు. కాగా, చెరువు అభివృద్ధితోపాటు వరద నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.



# పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.17.5 కోట్లు మంజూరు – మంత్రి సవిత

- **ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలి**
- **పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రి సవిత సమీక్ష**

**పెనుకొండ ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్**

మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ తెలిపారు.. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ నాయకులు, సంబంధిత అధికారులతో అభివృద్ధి పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు.ప్రతి వార్డులో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన చోట మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.మున్సిపాలిటీ పరిధిలో రూ.17.5 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో 1,790 మందికి పక్కా ఇళ్లకు మంజూరు అయ్యాయని తెలిపారు..అలాగే 100 కోట్లతో అమృత్ 2 పథకం కింద ఇంటింటికీ RO ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని,రూ.1 కోటితో పార్కుల అభివృద్ధి చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు.మున్సిపాలిటీ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మంత్రి సవిత సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు ఆమె ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని అని మంత్రి సవిత స్పష్టం చేశారు.



# ఓయూ స్టూడెంట్లను మోసం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

. నిధులు ప్రకటించి ఏడాది గడిచినా.. రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు.
"టీచర్లకు జీతాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని స్వయంగా సీఎం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోంది. విద్యార్థుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్కు లేదని చెప్తూనే ఉన్నాం. పాలిటెక్నిక్ కోర్సు కూడా స్కిల్ డెవలప్మెంట్ కోర్సు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్లోకి వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదు. మీ నిర్ణయం సరైనది అయితే.. మళ్లీ కమిటీ ఎందుకు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.15వేల కోట్లకు చేరాయి. యంగ్ ఇండియా స్కూల్స్ అని గొప్పగా చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. పాలిటెక్నిక్ కాలేజీలను రద్దు చేసి.. భూములు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. తెలంగాణలో విద్యార్థులు వారి హక్కుల కోసం పోరాడుతున్నారు. ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే.



విద్యార్థులను రాజకీయంగా వాడుకునే కాన్సెప్ట్ కు మేం వ్యతిరేకం. వారి ఉద్యమంలోకి మేం వెళ్లం.. నైతికంగానే మద్దతు ఇస్తాం" అని రామచందర్రావు తెలిపారు.



# హైబీపి, ఫ్యాటీలివర్, బ్లడ్ షుగర్ ప్రాబ్లమ్స్ ఉన్నప్పుడు ఏం తినాలి

మనకి వచ్చే ప్రాబ్లమ్స్ అన్నింటికీ మెడిసిన్స్ వాడాల్సిన అవసరం లేదు. మన ప్రకృతిలో ఔషధాల్లా పనిచేసే ఆహారాలు ఉన్నాయి. వాటిని తీసుకోవడం వల్ల చాలా వరకూ సమస్యల్ని తగ్గించుకోవచ్చు. సమస్య రాగానే మెడిసిన్‌పై ఆధారపడే బదులు రాకముందుగానే మెడిసిన్‌స్‌లా పనిచే ఫుడ్‌ని తీసుకుంటే చాలా వరకూ ప్రాబ్లమ్‌ని ముందునుంచే తగ్గించుకోవచ్చు. అందులో భాగంగా, ఫ్యాటీలివర్, బ్లడ్ షుగర్, బ్లడ్ ప్రెజర్ వంటి ప్రమాదకరమైన సమస్యలకి ఏ ఫుడ్ తింటే మంచిదో షేర్ చేసుకుంటున్నారు న్యూట్రిషనిస్ట్ ఖుషి.



**ఫ్యాటీ లివర్‌ని తగ్గించే కాలీఫ్లవర్**

మీకు గనుక ఫ్యాటీ లివర్ ప్రాబ్లమ్ ఉందని తెలిస్తే ముందునుంచీ కాలీఫ్లవర్ తినడం అలవాటు చేసుకోండి. దీని వల్ల సమస్య నుంచి బయటపడడానికి హెల్ప్ అవుతుంది. కాలీఫ్లవర్ తినడం వల్ల అందులోని ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి గుణాలు లివర్‌ని డీటాక్స్ చేస్తాయి. ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి. దీంతో పాటు లివర్ సెల్‌స్‌ని కాపాడతాయి. ఇది హెపాటిక్ స్టీటోసిస్‌ని మెరుగ్గా చేసే ఆహారంగా మారుతుంది. దీనిలోని కోలిన్ జీవక్రియని మెరుగ్గా చేస్తుంది. అంతేకాకుండా, కేలరీలు తక్కువగా నీటిశాతం ఎక్కువగా ఉండే ఈ వెజిటేబుల్ వెయిట్ మేనేజ్‌మెంట్ హెల్ప్ చేసి ఫ్యాటీ లివర్‌ని తగ్గించడానికి మేలు చేస్తుంది.

**బ్లడ్‌ప్రెజర్‌ని తగ్గించే బీట్‌రూట్**

బీట్‌రూట్, బీట్‌రూట్ జ్యూస్‌లోని అకర్బన నైట్రేట్ కంటెంట్ కారణంగా బీపిని తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. ఇది నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను శాంతపరిచి వెడల్పు చేయడానికి, రక్త ప్రవాహాన్ని మెరుగ్గా చేయడానికి హెల్ప్ చేస్తుంది. బీట్‌రూట్ జ్యూస్‌ని తీసుకోవడం వల్ల సిస్టోలిక్, డయాస్టోలిక్ బ్లడ్ ప్రెజర్ రెండూ కూడా తగ్గుతాయి. అయితే, ప్రభావాలు మారుతూ ఉంటాయి. దీనిని తీసుకునే ముందు డాక్టర్ సలహా తీసుకుంటే మీరు వాడే మందులని బట్టి ఒత్తిడిని తగ్గించేలా వారు సజెస్ట్ చేస్తారు.

**ఇమ్యూనిటీని పెంచే క్యాప్సికమ్**

క్యాప్సికమ్‌లో ఎక్కువగా విటమిన్ సి ఉంటుంది. దీని వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. అంతేకాకుండా, తెల్ల రక్తకణాల ఉత్పత్తికి మద్దతు ఇస్తుంది. ఇన్ఫెక్షన్‌స్‌తో పోరాడుతుంది.





విటమిన్ ఎ, బి6, యాంటీ ఆక్సిడెంట్‌స్‌తో పాటు వాపుని తగ్గిస్తుంది. కణాలని రక్షిస్తుంది. ఇందులోని పోషకాలు ఇమ్యూనిటీకి అవసరమైన ఐరన్ అబ్జార్బ్‌కి హెల్ప్ చేస్తాయి. కొన్ని హానికరమైన గట్ బ్యాక్టీరియాని కూడా నాశనం చేస్తాయి. ఇమ్యూనిటీ పనితీరుని మరింత పెంచుతాయి.

**షుగర్‌ని తగ్గించే కాకరకాయ**

కాకరకాయని చాలా మంది తినడానికి ఇష్టపడరు. కానీ, ఇందులోని పాలిపెప్టైడ్ పి, చరాంటిన్స్ సహజ ఇన్సులిన్‌లా పనిచేసి రక్తంలో చక్కెర స్థాయిలని తగ్గిస్తాయి. వీటిని తినడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగ్గా మారుస్తాయి. గ్లూకోజ్‌ని ఉపయోగించుకోవడంలో సాయపడతాయి. కానీ, ఇవే నివారణ కాదు. కానీ, సమస్యని కంట్రోల్ చేయడానికి హెల్ప్ చేస్తాయి.

**జీర్ణ సమస్యల్ని తగ్గించే ముల్లంగి**

ముల్లంగి కూడా చాలా మంచి వెజిటేబుల్. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది బాడీలోని వ్యర్థాలను ప్రేగుల ద్వారా బయటికి పంపి కొవ్వుల జీర్ణక్రియని మెరుగ్గా చేస్తాయి. అందేకాకుండా, ఇందులోని సహజ సమ్మేళనాలు పైత్యరసం ప్రవాహాన్ని ప్రేరేపిస్తాయి.

**అలానే కొన్ని ఫుడ్‌స్‌తో**

క్యారెట్స్ : అదే విధంగా, కంటి సమస్యలు ఉన్నవారు క్యారెట్‌స్‌ని తింటే మంచిది. ఇందులో బీటా కెరోటిన్ ఉంటుంది. ఇది విటమిన్ ఎగా మారి కంటిచూపుని మెరుగ్గా చేస్తుంది.

చర్మ సమస్యలకి తోటకూర : తోటకూరలో విటమిన్ సి, ఈ, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి.

# నడుము చుట్టూ కొవ్వు పెరిగి ఏ డ్రెస్ పట్టట్లేదా, ఇప్పుడు చెప్పిన డైట్‌తో 28 రోజుల్లో నాజుకైన నడుము మీ సొంతం





నడుము చుట్టూ కొవ్వు పెరిగితే చూడ్డానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. కొంతమంది బాడీ టైప్‌ని బట్టి ఇలా ఉంటుంది. వారు ఎన్ని ఎక్సర్‌సైజెస్ చేసినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నా సమస్య తగ్గదు. అలాంటప్పుడు మంచి డైట్ తీసుకోవాలి. దీంతో బాడీలోని ఫ్యాట్ తగ్గుతుంది. కొన్ని ఫుడ్‌స్‌ని తీసుకుంటే చాలా వరకూ హెల్ప్ అవుతుంది. అలాంటి డైట్ గురించి వెయిట్‌లాస్ ఎక్స్‌పర్ట్ అమీషా శర్మ షేర్ చేసుకుంటున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ప్రకారం, చెప్పిన ఫుడ్స్ రెగ్యులర్‌గా తింటే 28 రోజుల్లోపు మంచి రిజల్ట్స్ కనిపిస్తుందని చెబుతున్నారు. మరి ఆ డైట్ డీటెయిల్స్ మీరు తెలుసుకోండి.

**ప్రతీ మీల్‌లోనూ ప్రోటీన్**

ప్రోటీన్ అనేది మన బాడీలోని ఫ్యాట్‌ని కరిగించడానికి హెల్ప్ చేస్తుంది. నడుము చుట్టుకొలత తగ్గకపోతే ఇన్సులిన్ బ్యాలెన్స్‌గా ఉండదు. కాబట్టి, అలాంటి ఫ్యాట్‌ని తగ్గించేందుకు ప్రోటీన్ ఫుడ్స్ తీసుకోవడం మంచిది. గుడ్లు, పనీర్, పెరుగు, పప్పు, టోఫు వంటివి తీసుకోవాలి. వీటన్నింటిలోనూ పుష్కలంగా ప్రోటీన్ అందుతుంది. ఫ్యాట్‌ని కరిగించి మజిల్‌స్‌ని స్ట్రాంగ్‌గా చేయడంలో చాలా వరకూ ప్రోటీన్ ఫుడ్ హెల్ప్ చేస్తుంది.

**పచ్చి కూరగాయలు**

కూరగాయల్లో ఫైబర్ ఉంటుంది. కాబట్టి, వాటిని మన డైట్‌లో యాడ్ చేసుకోవాలి. అందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని పచ్చిగా తీసుకుంటే కొవ్వుని కరిగిస్తుంది. దీనికోసం మీరు దోసకాయ, క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీని తీసుకోవచ్చు. వీటిని నేరుగా తినడం నచ్చకపోతే సలాడ్‌స్‌లా తినాలి. దీని వల్ల వాపు, నీరు నిల్చిపోవడం వంటి సమస్యలు తగ్గుతాయి. అయితే, కొంతమందికి ఇవి పడవు. అలాంటప్పుడు రోజూ కాకుండా కాస్తా గ్యాప్ ఇచ్చి మొదట్లో తక్కువ పరిమాణంలో తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.



**నానబెట్టిన గింజలు**

గుమ్మడి గింజలు, అవిసెలు, చియా సీడ్స్ వంటివి తీసుకుంటే మంచిది. వీటిని తీసుకోవడం వల్ల హార్మోన్ల బ్యాలెన్స్ అవ్వడమే కాకుండా, ఆకలి కూడా కంట్రోల్ అవుతుంది. అంతేకాకుండా, క్రేవింగ్స్ తగ్గుతాయి. దీంతో జంక్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకోరు. కాబట్టి, ఫ్యాట్ పెరగవు.



**పండ్లు తినే విషయంలో**

కొంతమంది పండ్లు మంచివి కదా అని ఎప్పుడు పడితే అప్పుడు తింటుంటారు. కానీ, అవి మంచివే. అయితే, ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా సరైన సమయంలో తీసుకోవాలి. ముఖ్యంగా భోజనం తర్వాత తీసుకోకపోవడమం మంచిది. అయితే, వీటిని నేరుగా కాకుండా, ఫైబర్‌తో కలిపి తీసుకోవడం మంచిది. దీంతో బెల్లీ ఫ్యాట్, ఫ్యాట్ పెరగదు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మంచిది? రాత్రి 8 గంటలకు ముందే భోజనాన్ని ఫినిష్ చేయాలి. ఆలస్యంగా భోజనం చేస్తే కార్టిసాల్ పెరుగుతుంది. బాడీలోని కొవ్వు స్టోర్ అయిపోతుంది. తిన్న తర్వాత 10 నుంచి 15 నిమిషాల పాటు నడవడం అలవాటు చేసుకోండి.



అనంత జనశక్తి
శుక్రవారం | అనంతపురం
28.08.2026



# ఆ వందరూపాయలే ఈ స్థాయిలో ఉంచాయి: జీవీ నారాయణ గతంలో పంచుకున్న విషయాలు





100కు పైగా సినిమాలతో ప్రేక్షకులను మెప్పించిన జీవీ నారాయణ రావు తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. బుధవారం సాయంత్రం కన్నుమూశారు. తొలి సినిమాతోనే నంది అవార్డు అందుకున్న ఘనత నారాయణది. సినీకెరీర్, ఇండస్ట్రీలో తన స్నేహితులైన రజనీకాంత్, చిరంజీవి గురించి ఆయన గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో పంచుకున్నారు. జీవితంలో ఎదురైన ఒడుదొడుకుల నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు చెప్పారు.

**డబ్బు మీద ఎప్పుడూ ఆశ లేదు..**

"రూ.5000 సంపాదిస్తే చాలు అనుకుని సినిమాల్లోకి వచ్చాను. మేం నాటకాలు వేసేటప్పుడు ఆ మొత్తం చాలా పెద్దది. నా మొదటి సినిమా 'అంతులేని కథ'కు గానూ నాకు, రజనీకాంత్‌కు కలిపి రూ.2000 పారితోషికం ఇచ్చారు. రూ.100 అడ్వాన్స్‌గా ఇచ్చారు. అదే అప్పట్లో గొప్ప విషయం. ఆ చెక్ తీసుకెళ్లి గుడిలో పూజ చేయించుకున్నాం. ఆ వందరూపాయలే మమ్మల్ని ఈ స్థాయిలో ఉంచాయి. అప్పట్లో నటి సుజాతతో 'ఇంటికో రుద్రమ్మ' అనే సినిమా తీశా. అది సరిగ్గా ఆడలేదు. అదే సినిమా శారదతో తీసి ఉంటే సూపర్ హిట్ అయ్యేది. అయినా ఆ విషయంలో బాధపడలేదు. ఆపై హీరోయిన్ ఎంపికలో జాగ్రత్త పడ్డాను. ఎన్నో సినిమాలు నిర్మించినా డబ్బు మీద ఎప్పుడూ ఆశ పడలేదు. ప్రేక్షకుల ప్రేమను సంపాదించుకున్నాను"

**రజనీకాంత్ - చిరంజీవి గురించి..**

"నేను, రజనీకాంత్ మంచి స్నేహితులం. అతడు చాలా రిస్క్ చేసి ఇండస్ట్రీకి వచ్చాడు. బస్ కండక్టర్‌గా ఉద్యోగం చేస్తూ.. దాన్ని మధ్యలో వదిలేసి రెండేళ్లు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మా ఇంట్లో భోజనం చేసి వెళ్తూ వెళ్తూ ఖర్చుల కోసం రెండు రూపాయలు అడిగి తీసుకెళ్లేవాడు. చిరంజీవి హీరో కావడానికి వాళ్ల నాన్న చాలా ప్రోత్సహించారు. చిరుకు సాయం చేసే గుణం ఎక్కువ. సినిమా 100 రోజుల కార్యక్రమాల్లో ఎంతోమంది రైతులకు సాయం చేశాడు. ఆయన చేసిన ఎన్నో మంచి పనులు ప్రపంచానికి తెలియవు".

**జీవితంలో ఎన్నడూ పశ్చాత్తపపడలేదు..**

"నేను మంచి పాత్రలు చేశా. మొదటి సినిమా నుంచి మొదలు పెడితే ఎన్నో అవార్డులు వచ్చాయి. జీవితంలో ఏ విషయంలోనూ నాకు పశ్చాత్తాపం లేదు. ఇది సాధించలేకపోయాననే బాధ లేదు. దేవుడు ఇచ్చిన దాంట్లో తృప్తిగా బతికాను. చేతనైనంత సాయం చేశాను" అని గతంలో నారాయణ పంచుకున్నారు.



# సంస్కృతి పట్ల గౌరవాన్ని దుస్తులతో కొలుస్తారా!

పండగ స్ఫూర్తి అనేది భావోద్వేగాలు, సంప్రదాయాలలో ఉంటుందని.. అంతేగానీ ఒక మహిళ వస్త్రధారణలో ఉండదని అంటోంది బాలీవుడ్ నటి కృతి సనన్. ఇటీవల ఆమె చేసిన రక్షా బంధన్ వాణిజ్య ప్రకటనపై సామాజిక మాధ్యమాల వేదికగా పలు వు రు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అందులో ఆమె రాఖీ పండగకు ధరించిన దుస్తులపైనా, పెంపుడు జంతువుకు రాఖీ కట్టడం గురించి నెటిజన్ల నుంచి విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో వాటికి గట్టిగా బదులిస్తూ కృతి తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ పెట్టారు. "మహిళలు ఏమి ధరించాలో చెప్పడం మనం ఎప్పుడు ఆపుతాం? ఏళ్ల తరబడి సంప్రదాయ ఫ్యాషన్ ఎంతో అభివృద్ధి చెందుతుంది. కానీ, ఇప్పటికీ ఒక మహిళ తన సంస్కృతి పట్ల చూపించే గౌరవాన్ని కేవలం ఆమె దుస్తులతోనే కొలుస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఆమె హృదయంలో ఉంటాయి. ఆమె నెక్‌లైన్‌లో కాదు! పండగల స్ఫూర్తి మనం ధరించే దుస్తులలో లేదు. సంప్రదాయాల పట్ల మనం కలిగి ఉండే భావోద్వేగాలు, వాటి అర్థంలో ఉంది. రాఖీ ఒక రక్షణ బంధం. నేనూ, నా సోదరి ఒకరికొకరం రాఖీ కట్టుకుంటాం. సోదరులు ఎలాగైతే ఒకరినొకరు కాపాడుకుంటారో మేమూ అదే స్థాయిలో మమ్మల్ని కాపాడుకోగలం. ఈ వాగ్దానం మాకు, మా కుక్క లకు కూడా వర్తిస్తుంది. ఏదేమైనా అవి మా కుటుంబమే కదా!" అని అందులో రాసుకొచ్చారు.



# ఆ అడవికి కాపలా ఓ అజ్ఞాత శక్తి

`సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా ప్రధాన పాత్రల్లోరూపొందుతున్న చిత్రం 'ది వీవాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్'. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 25న రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ఆ అడవికి ఒక అజ్ఞాత శక్తి కాపలాగా ఉండేది. నేను చూసే ఈ వింత విషయాలన్నిటికి అర్థం ఏమిటి? మీకు ఈ అడవితో ఏదో సంబంధం ఉంది. మనకు ఆమె రక్షకురాలు. ఆమె దివ్య వాహనమే పులి" లాంటి సంభాషణలు ఆసక్తిగా సాగాయి. ఎవరూ అడుగు పెట్టడానికి కూడా సాహసించని ఒక ప్రదేశంలోకి ప్రవేశించి, అడవి జానపద సంస్కృతి, దాని అతీంద్రియ సారం గురించి ఒక పూర్తి రహస్యాన్ని బయటపెట్టడమే ఈ చిత్ర కథాంశమని టీజర్ స్పష్టం చేస్తుంది.




# కివీస్ vs భారత్.. హాట్‌కేకుల్లా అమ్ముడైన ప్రిసేల్ టికెట్లు




టీమ్‌ఇండియా ఎక్కడ ఆడితే అక్కడ కాసుల వర్షం అనేందుకు ఇదొక ఉదాహరణ. మరో రెండు నెలల్లో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. మూడు ఫార్మాట్లలోనూ సిరీస్‌లు ఆడనుంది. ఇరు జట్లూ ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టుల్లో తలపడనున్నాయి. మొత్తం 12 మ్యాచులు ఐదు వేదికల్లో జరుగుతాయి. ఈ క్రమంలో కివీస్ జట్టు ప్రిసేల్ ద్వారా అక్కడి అభిమానుల కోసం టికెట్లను అందుబాటులోకి తెచ్చింది. అయితే, కేవలం 48 గంటల్లోనే 26వేల టికెట్లు అమ్ముడవ్వడం విశేషం.

అక్టోబర్‌లో టీ20 సిరీస్‌తో న్యూజిలాండ్ పర్యటన మొదలవుతుంది. క్రిస్‌ట్‌చర్చ్ వేదికగా తొలి రెండు టీ20లు జరుగుతాయి. ఈ మైదానం కెపాసిటీ 9వేలు మాత్రమే. టీ20లతోపాటు ఓ టెస్టు మ్యాచ్ కూడా జరగనుంది. మిగతా మూడు మ్యాచులు వెల్లింగ్టన్, ఆక్లాండ్, హామిల్టన్ మైదానాల్లో జరుగుతాయి.

పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌ల కోసమే కాకుండా టెస్టులను చూసేందుకూ డిమాండ్ ఉందని కివీస్ చీఫ్ మార్కెటింగ్, కమర్షియల్ ఆఫీసర్ గ్లెన్ క్రిచ్‌లే తెలిపారు.

"తొలి రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో సేల్స్ నమోదయ్యాయి. భారత్ వంటి పెద్ద జట్టుతో ఆడే మ్యాచులను వీక్షించే అవకాశం కివీస్ అభిమానులకు చాలా అరుదుగానే వస్తుంటుంది. గత సీజన్ మాదిరిగానే ఈసారి కూడా టికెట్ల ధరలను అందుబాటులోనే ఉంచాం. నేషన్ యాక్సెస్ కోడ్ వినియోగించుకో వడం ద్వారా ఇక్కడి అభిమానులకు 30 డాలర్ల కంటే తక్కువకే టికెట్ రానుంది. ముందస్తు సేల్‌లో ఫ్యాన్స్ నుంచి మంచి ఆదరణ లభించడం ఆనందంగా ఉంది. సెప్టెంబర్ 7 నుంచి సాధారణ టికెట్లను అందుబాటులోకి తీసుకొస్తాం" అని గ్లెన్ వెల్లడించారు.

# మూడు వారాలే ఉంది..

## ఇదేం పిచ్.. ఇలాగేనా వసతి?: బీసీసీఐ, పీసీబీ అసంతృప్తి



జపాన్ వేదికగా మరో మూడు వారాల్లోనే ఆసియా గేమ్స్ ప్రారంభమవుతాయి. అందులో క్రికెట్ కూడా భాగమే. కానీ, అక్కడి ఏర్పాట్లపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా మ్యాచులను నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. అయితే, పిచ్ నాణ్యత అత్యంత నాసిరకంగా ఉందని.. అలాగే వసతికి సంబంధించి కూడా సరైన ఏర్పాట్లు లేవని బీసీసీఐ, పీసీబీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారత్, పాక్, బంగ్లా, శ్రీలంక, అఫ్గాన్‌తో కూడిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ నుంచి ప్రతినిధుల బృందం జపాన్‌లో పర్యటించనుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం మైదానం కనీసం 2వేల మంది అభిమానులు చూసేలా ఉండాలి. కానీ, జపాన్ ఎంపిక చేసిన స్టేడియం అందుకు తగ్గట్టుగా లేదు.

"ఆసియా గేమ్స్‌లో క్రికెట్ మ్యాచులను నిర్వహించాలని అనుకుంటోన్న మైదానం స్థాయి చాలా చిన్నది. పిచ్ నాణ్యతపైనా సందేహాలు ఉన్నాయి. గత మేలో అక్కడ ఓ టోర్నమెంట్ మినహా.. ఎక్కువగా మ్యాచులు జరగలేదు. కనీసం ఇక్కడ సరైన డ్రెస్సింగ్ రూమ్‌లు కూడా లేవు" అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే విషయంపై భారత ఒలింపిక్ అసోసియేషన్, ఆసియా గేమ్స్ ఆర్గనైజింగ్ కమిటీతో ఇప్పటికే బీసీసీఐ చర్చలు జరిపినట్లు సమాచారం.

**ఆటగాళ్ల వసతిపైనా..**

మ్యాచ్‌లు జరగనున్న మైదానానికి ఆటగాళ్లు ఉండే హోటళ్లకు 20 కి.మీ దూరం ఉన్నట్లు తెలుస్తోంది. ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్ ప్లేయర్లతో కలిపి వారికి వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఆ గదులు కూడా చాలా చిన్నవిగా ఉన్నాయని.. ఇద్దరు ప్లేయర్లు తమ కిట్‌లు, బ్యాగ్‌లను అందులో ఉంచుకొనేందుకూ సరిపోదనేది అధికారుల సందేహం. పురుషుల, మహిళా జట్ల నుంచి స్టార్ ప్లేయర్లు ఆడే ఈ టోర్నీలో సరైన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

# సహచరులుగా అప్పుడు తండ్రులు.. ఇప్పుడు కుమారులు




భారత క్రికెట్‌లోకి వారసులు రావడం కొత్తేమీ కాదు. అయితే, ఇద్దరు దిగ్గజ క్రికెటర్ల కుమారులు ఒకేసారి తమ అండర్ -19 కెరీర్‌ను ప్రారంభించడం గమనార్హం. మొన్నటి తరం వరకూ ఆ ఇద్దరు సీనియర్ల క్రికెట్‌ను చూసిన అభిమానులకు.. ఇప్పుడు వారి కుమారుల ఆటను వీక్షించే అవకాశం రాబోతోంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన అండర్-19 జట్టులో వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ కుమారులకు చోటు దక్కింది. ఈ మేరకు బీసీసీఐ డొమెస్టిక్ సెలక్షన్ కమిటీ.. ఆస్ట్రేలియాతో వన్డే, మల్టీడే మ్యాచుల కోసం స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇందులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు అవకాశం లభించింది.

డ్యాషింగ్ ఓపెనర్ అయిన వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్. అతడు కూడా దూకుడైన బ్యాటరే. ఇటీవల ఓ మ్యాచ్‌లో అచ్చం తన తండ్రిలానే కొట్టిన షాట్ల వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్.. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్. రాజ్‌కోట్ వేదికగా ఆసీస్ u19 జట్టుతో భారత్ యువ టీమ్ తలపడనుంది. వన్డే జట్టుకు రాయ్‌చందాని సారథిగా వ్యవహరిస్తాడు. యశ్‌బర్ధాన్ చౌహాన్ అతడికి డిప్యూటీగా ఎంపికయ్యాడు. ఇక మల్టీడే మ్యాచులకు చౌహాన్ కెప్టెన్ కాగా.. రాయ్‌చందాని వైస్ కెప్టెన్‌గా ఉంటారు.

**స్క్వాడ్‌లు**

వన్డేలకు: లక్ష్య రాయ్‌చందాని (కెప్టెన్), యశ్‌బర్ధాని చౌహాన్ (వైస్ కెప్టెన్), రజత్ బాగెల్ (వికెట్ కీపర్), ఆర్యవీర్ సెహ్వాగ్, వీకే వినీత్, కుషాంగ్రా ఓఝా, అర్జున్ రాజ్‌పుత్, మనల్ చౌహాన్, అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), యశ్‌వీర్, రోహిత్ యాదవ్, షావిన్ వినోద్, మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట, కావ్యా పటేల్

మల్టీడే మ్యాచులకు: యశ్‌బర్ధాని చౌహాన్ (కెప్టెన్), లక్ష్య రాయ్‌చందాని (వైస్ కెప్టెన్), సాగర్ విర్క్, కుషాంగ్రా ఓఝా, మనల్ చౌహాన్, కుష్ పటేల్, మానవ్ కృష్ణ (వికెట్ కీపర్), అభిప్రాయ్ బిశ్వాస్ (వికెట్ కీపర్), రోహిత్ యాదవ్, ఇషాన్ ఓమ్, అయాన్ అక్రమ్, ప్రణవ్ రాఘవేంద్ర, ప్రియాన్ను సింగ్, మోహిత్ ఉల్వా, ఆర్యన్ యాదవ్

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314